


**వార్తాప్రభ**

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 172 | ది.9-10-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 172 | Date : 9-10-2026 | Friday | Pages : 8 | Rs.1/- |

# కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్

## 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు
- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిపై ప్రధానికి వివరించిన సీఎం



**ఢిల్లీ, అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ప్రధాని మోదీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి... స్పష్టమైన లక్ష్యం.....ధృడమైన నిర్ణయాలు... సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశ గమనాన్ని మర్చారని సిఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

**నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు..** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు గోదావరి - కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి--కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని... ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళితే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సిఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా...దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు.

**రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం..** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని...ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సిఎం వివరించారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలిపారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు.

**మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై వినతి..** రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారాన్ని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖ మెట్రోను మంజూరు చేయాలని సిఎం కోరారు. అలాగే బీచ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. 2047 నాటికి రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర -- 2047 విజన్ గురించి ప్రధానికి సీఎం తెలిపారు.

# బిల్డ్ ఏపీ మా ప్రభుత్వ నినాదం

## భారత అభివృద్ధి ప్రయాణంలో "ఏపీది కీలక పాత్ర" అన్న కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, అమిత్ షా, గడ్కరీ

- ఎంవోయూలను పెట్టుబడులుగా మలిచేలా కార్యాచరణ
- త్వరలోనే పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా
- ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మరువలేం
- సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు







**ఢిల్లీ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి పాల్గొన్నారు. అదే విధంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర రవాణా మంత్రి గడ్కరీ లను సీఎం కలిసారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. గడచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చెప్పారు. కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలిచేలా ప్రత్యేకంగా దృష్టి సారించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణమే అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**నీటి వనరులు... గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి..** గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందని, మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ అంగీకరించిందని వెల్లడించారు. తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమలో ఐదో తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును రక్షణ శాఖ ప్రారంభించిందని తెలిపారు. డేటా లేక్ వంటి వ్యవస్థల ద్వారా ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు.

# ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!

- మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి అధిగమించాలి: డా. జి.సమరం
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు



**విజయవాడ, అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

# కోర్టు తీర్పు తర్వాత ఎన్నికలు, బ్యాలెట్ పేపర్ ద్వారానే



**అమరావతి, అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** సుప్రీంకోర్టు తీర్పు తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అనిలచంద్ర పునేఠా తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి సిద్ధమైన ఓటర్ల జాబితా ఆధారంగానే స్థానిక ఎన్నికలు ఉంటాయని చెప్పారు. బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తామని, ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామన్నారు. రెండు నెలలుగా ఏర్పాట్లు సాగుతున్నాయని, ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేసేందుకు డిజిటల్ యాప్

## - ప్రారంభించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి





**విజయవాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు. మాన్యువల్ ప్రక్రియలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ప్రజలతో మరింత అనుసంధానం కావడానికి ఈ యాప్ దోహదపడుతుందని మంత్రి తెలిపారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడనికి కృషి చేసిన శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. సరైన సమాచారాన్ని సరైన సమయంలో, సరైన డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రజలకు చేరవేసేలా సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్‌డోర్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, కేడర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగల సమాచారాన్ని సమీకరించి ఈ డిజిటల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సమాచార ప్రసారం, మీడియా నిర్వహణ, పౌర సంబంధాలు, వాస్తవాల ధృవీకరణ, ప్రకటనలు, కేడర్ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా అధికారులు ఎక్కడి నుంచైనా శాఖకు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా వార్తా విశేషాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచార ప్రసార కార్యకలాపాలను ఈ యాప్ ద్వారా ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దీని వలన క్షేత్రస్థాయి సమాచారం కూడా ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 90 గజాల్లో ఐదంతస్తుల అక్రమ నిర్మాణం

- కొండాపూర్ ప్రభుపాద లేఅవుట్‌లో నిబంధనలకు తూట్లు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** కొండాపూర్ ప్రభుపాద లేఅవుట్‌లో 90 గజాల స్థలంలో జీ+5 అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా సీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. చిన్న స్థలంలో భారీ నిర్మాణంతో సెట్‌బ్యాక్‌కు అవకాశం లేకపోవడంతో ప్రమాదాల సమయంలో అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా నోటీసులకే పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణంపై సీఎంసీ, హైడ్రా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**గౌరవనీయులైన IVవ అదనపు జిల్లా మరియు ప్రిన్సిపుల్ ఫ్యామిలీ జడ్జి గారి న్యాయస్థానం, విజయవాడ**

F.C.O.P. No. 2002/2025

వారి మధ్య (Between):

కొల్లు హేమ

---పిటిషనర్/వాది (Petitioner)

మరియు

కొత్తపల్లి కోటేశ్వర రావు

---రెస్పాండెంట్ / ప్రతివాది (Respondent)

టు (To),

కొత్తపల్లి కోటేశ్వర రావు (Respondent), డోర్ నెం. 1-1/6-38-1, కరకట్ట పోస్ట్, విద్యాధరపురం, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా.

నోటీసు (Notice)

పై నెంబర్ కేసులో రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయాలు కోర్టు నోటీసు పంపినను, తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, ఈ వార్తా పత్రిక ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ది: 16-11-2026 వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10:30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు/సమాధానము తెలియపరచవలెను. లేని యెడల ఈ కేసు మీ పరోక్షముగా తీర్మానించబడును .

(పై కోర్టు ఆర్డరు తేదీ: 01-10-2026)

వాయిదా తేదీ: 16-11-2026

సం/-

**మారడ గోవర్ధన్ వర్మ**

న్యాయవాది లబ్బీపేట, విజయవాడ

ఫోన్ నెం: 9492605274

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL**

Gr. & 1st floor, Sri Narayana Bhawanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-5300020.

Notice under section 17 of Securitization Act R/w Provisions of the Debts recovery Act and Debts Recovery Tribunal (Procedure) Rules, 1993, As Amended from time to time

**Case N.O SA 408 OF 2026**

1. Kolla Venkata Naga Syamalamba, W/o. Haranadh Babu, D.No. 1-179, Mother of (late) KVVS Naga Prasad, Hindu, Female, aged about 64 years, Indupalli Village, Unguturu Mandal, Krishna District, Andhra Pradesh, And another -- **APPLICANTS**

AND:

**1. Authorized Officer**
Bajaj Finance Limited, 2nd Floor, D.No. 32-9-17, Madhu Maha Laxmi Chambers, Jammichettu Center, Mogalrajapuram, Vijayawada 520 010.
And others -- **RESPONDENTS**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

**1.Authorized Officer**
Bajaj Finance Limited, 2nd Floor, D.No. 32-9-17, Madhu Maha Laxmi Chambers, Jammichettu Center, Mogalrajapuram, Vijayawada 520 010.

**2. The Manager**
HDFC Life Insurance Office, upstairs of Passport Office, M.G. Road, Vijayawada An application under (under section 17 of the securitisation and reconstruction of financial assets and enforcement of security interest act, 2002 has been filed before this Tribunal A copy of application is enclosed.

Show cause to why the relief prayed for should not to granted you are required to file reply, if any in you defenses in the paper book form in two complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal 13/11/2026 at 10.30 A.m failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply advance copy of the Reply to S.A to the Counsel for the Applicant.

Given Under my hand and the seal of this Tribunal on this **05-10-2026.**

**Registrar - Debts Recovery Tribunal, Visakhapatnam**

***Signature of the Authorized to Issued Summons***

**దస్తావేజు పోయినది**

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ, గాంధీనగర్, రామానగర్, నంబూరివారి వీధి, డోరు నెం.24-5-13/1 కాపురస్తురాలు సాదరబోయిన రంగారావు గారి భార్య సాదరబోయిన సుభాషిణి అనే నేను మా ఇంటివద్ద నుండి గాంధీనగర్ తాలూకా ఆఫీసు వద్దకు జిరాక్సు నిమిత్తం వెళుతుండగా నూజివీడు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో 1వ పుస్తకం, నెం.1338/2000గా రిజిస్ట్రేషన్ కాబడిన ఒరిజినల్ దఖలు దస్తావేజుతోపాటు కొన్ని కాగితములు కలిగిన కవర్ జారిపడిపోయినది. పరిసర ప్రాంతాలలో ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ దస్తావేజు కనవడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగి యుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం. 7396977916

# న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

- తిరువూరులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



**తిరువూరు,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి వారి భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా న్యాయవాదులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంకురాత్రి జనార్దన్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, పలువురు న్యాయవాదులు హత్యలకు గురవుతున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. న్యాయవాదుల ప్రాణాలకు, విధులకు భద్రత కల్పించేందుకు రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. రిలే నిరాహార దీక్షలో జనరల్ సెక్రటరీ గోగిరెడ్డి కృష్ణారెడ్డి, చిరుమామిళ్ల వెంకటేశ్వర రావు, చిలకా హేమంత్ కుమార్, మన్నె వెంకటేశ్వరరావు, కారుమంచి సునీల్ పాల్గొన్నారు. సెక్రటరీ కనపర్తి రాంబాబు, స్పోర్ట్స్ సెక్రటరీ గుండాల భాస్కర్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు దీక్షకు సంఘీభావం తెలిపారు.

# రెవెన్యూ రీ సర్వే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కూటమి పార్టీ సభ్యులు



**విస్సన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో సచివాలయం రెండు పరిధిలో రెవెన్యూ రీ సర్వే కార్యక్రమం మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి సారధ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా మరియు పురుషులు రైతులతో పాటు విస్సన్నపేట క్లస్టర్ ఇంచార్జి నెక్కలపు శ్రీనివాసరావు ( డాబా శ్రీను),రీ సర్వే డి టి అర్చన, డిప్యూటీ తాసిల్దార్ విజయ భాస్కర్, ఆర్ ఐ సుజాత, వీఆర్వో పార్థసారథి, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వచ ఆంధ్ర అవార్డు గ్రహిత మహమ్మద్ రఫీ కి ఘన సన్మానం



**మైలవరం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా స్వచ ఆంధ్ర అవార్డు అందుకున్న మైలవరం గ్రామ పంచాయితీ ఈవొ మహమ్మద్ రఫీ ని మైలవరం మండలం గ్రామ పంచాయితీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో మల్లి మౌనిక చేతుల మీదగా గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాల యం సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 10న జరిగే రాజభవన్ ముట్టడిని విజయవంతం చేయండి...

-శౌంరి నాగరాజు పిలుపు



**పెడన,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఈనెల 10వ తేదీన రాజభవన్ ముట్టడిని విజయవంతం చేయాలని పిసిసి బిసి సెల్ అధ్యక్షుడు శౌంరి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం నాడు అయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారి వెంటనే రాజీనామా చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఆయనను అరెస్టు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. రాజ్ భవన్ ముట్టడిని కి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాలేపు సూరిబాబు రవి పాల్గొన్నారు

# ముగ్గురు ఐఏఎస్ అధికారుల బదిలీ, పోస్టింగ్స్

**విజయవాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్స్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. మల్లారపు నవీన్ (2019 బ్యాచ్) --- కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేశారు. వారి సేవలను ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు అప్పగిస్తూ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించేందుకు చర్యలు చేపట్టారు. ఫర్మాన్ అహ్మద్ ఖాన్ (2020 బ్యాచ్) --- శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేసి, ఆర్థిక శాఖలో డిప్యూటీ సెక్రటరీగా నియమించారు. గుడిస బాలకృష్ణ --- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వారిని మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ మిషన్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో ఈ పదవిలో ఫుల్ అడిషనల్ చార్జ్ నిర్వహిస్తున్న వి. కరుణ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. అదే సమయంలో బాలకృష్ణకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ అదనపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవికి కూడా ఫుల్ అడిషనల్ చార్జ్ అప్పగించారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాలకు లాటరీ..

– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రక్రియ



**విజయవాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026–27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 (తేదీ: 24.09.2026)వ తేదీన జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్ రావు, ఎన్‌టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరులో రాజకీయ చదరంగం.. బీసీ అజెండాతో ఎమ్మెల్యే కొలికిపూడి దూకుడు



**తిరువూరు,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తన రాజకీయ ప్రాభవాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు కూడా బీసీ వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. తిరువూరులో నిర్వహించిన బీసీ సభకు స్పందన రావడంతో ఎమ్మెల్యేలో మరింత ఉత్సాహం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జోష్‌తో బీసీ వర్గాల్లో తన ప్రాభవాన్ని మరింత పెంచుకునే దిశగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు విసన్నపేట నుంచి నెమలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భారీగా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్న ఈ ర్యాలీతో నియోజకవర్గంలో రాజకీయ సందడి నెలకొంది. బీసీ వర్గాలను కలుపుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లోనూ తన రాజకీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు వ్యూహం ప్రస్తుతం తిరువూరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులకు రాజకీయంగా చెక్ పెట్టే దిశగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే వ్యాఖ్యలు ఆయన అనుచర వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. విసన్నపేట నుంచి నెమలి వరకు సాగిన బైక్ ర్యాలీతో ఎమ్మెల్యే తన రాజకీయ సామ్రాజ్యాన్ని నియోజకవర్గంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తాం



**నందిగామ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్యను గురువారం నందిగామ కోర్టు ప్రాంగణంలో నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ కురగంటి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా మరియు సంక్షేమ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా చూడటం, వారి హక్కుల పరిరక్షణ, విద్యా మరియు ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక న్యాయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ఎస్సీ, ఎస్టీల సమస్యలను సానుకూలంగా పరిశీలించిన సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, వారి అభివృద్ధి మరియు సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, సంబంధిత అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణతో పాటు వారి అభ్యున్నతికి ప్రభుత్వ యంత్రాంగం, న్యాయవాదులు, సామాజిక సంస్థలు మరియు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కురగంటి రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాది తుల్లూరి విశ్వేశ్వరరావు, మొగులూరు గ్రామానికి చెందిన బండి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతినిధులు ఆకాంక్షించారు.

# బెస్ట్ సర్వీస్ ఇద్దాం.. అత్యున్నత గ్రేడ్ ను సాధిద్దాం..

- ఎంపీడీవో అధ్యక్షతన ఎస్‌డబ్ల్యూపీసీ వర్మీ కంపోస్ట్‌పై అవగాహన





**విస్సన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) ప్రాంగణంలో ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు అధ్యక్షతన వర్మీ కంపోస్ట్ తయారీపై గ్రామాల వారీగా వ్యర్థాల సేకరణ కొరకు సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, తడి చెత్తను వేరు చేసి వినియోగించడం, సేంద్రియ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇంటి పరిసరాలలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను సక్రమంగా వినియోగించి నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసుకుని రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఎరువుల తయారీ టార్గెట్ ను సాధించాలని ఆయన సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో శివ ప్రసాద్, ఈవో హరికృష్ణ కుమార్ పలు గ్రామాల కార్యదర్శులతో పాటు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు. ఉదయం సమయాలలో గ్రీన్ అంబాసిడర్ తడి చెత్త పొడి చెత్త లను తీసుకునేందుకు కేటాయించిన ప్రాంతానికి వెళ్లి గృహ యజమానులను విజిల్ సౌండ్ తో ఇంటి నుండి చెత్త అందించే కార్యక్రమాన్ని అలవాటు చేయాలని చెప్పారు. గృహ యజమానుల నుండి సానిటరీ వ్యర్థాలను బిన్ బ్యాగ్ కార్యక్రమంలో భాగంగా వారానికి ఒకసారి తీసుకోవాలని వాటిని గ్రామానికి దూరంగా తీసుకువెళ్లి భూస్థాపితం చేయాలన్నారు. ప్రమాదకర వ్యర్థాలను ఆసుపత్రుల నుండి మనం తీసుకోమని వారే వాటిని గ్రామాలకు దూరంగా తీసుకువెళ్లి గొయ్యి తీసి పూడ్చివేయాలన్నారు. సమీక్ష కృషితో మంచి సేవలు అందించి అత్యున్నత స్థాయి గ్రేడ్లను సాధిద్దాం అన్నారు. బిన్ బ్యాగ్ సేవల కార్యక్రమం ద్వారా సంపూర్ణ అవగాహన కల్పించడమే కాకుండా ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యాన్ని మహాభాగ్యంగా అందించేందుకు ప్రతి ఒక్కరం ఒక వారధిగా మారదామని చెప్పారు.

# గురుకులంలో ఘనంగా సామూహిక జన్మదినోత్సవ వేడుకలు





**గూడూరు, అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌లి శ్యామసుందరరావు అలియాస్ మయూరి శ్యామ్ యాదవ్ దాతృతమ్ తో మినీ గురుకులం నందు ప్రతీ నెలా క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను 7 మంది విద్యార్థినుల చేత భారీ కేక్ ను కట్ చేయించి వారికి మయూరి శ్యామ్ యాదవ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థినులు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ మీరందరూ ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. తను చేయు సేవా కార్యక్రమాలకు ఆ దేవ దేవుడు శ్రీ కృష్ణ పరమాత్ముడు ఆశీస్సులు, నా తల్లి దండ్రులు దివంగత బండి వనమ్మ , కృష్ణయ్య ల దీవెనలతో పాటు మయూరి స్వీట్స్ మరియు వనజా కృష్ణ కల్యాణ మండపం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతుంది అని తెలిపెను. ఈ కార్యక్రమంలో మినీ గురుకులంహెడ్ మాస్టర్ కెవి రజని కుమారి, ఉపాధ్యాయునులు లావణ్య , నాగూరమ్మ, లలిత, అంకమ్మ , చంద్ర మరియు విద్యార్థునులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించండి..... ఐసిడిఎస్ సిబ్బందికి ఎమ్మెల్యే సూచన




**పెడన,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విషయంలో అధికారులు దే కీలక పాత్ర అని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. పోషణ మాస ఉత్సవం ముగింపు సభ గురువారం నాడు బంటుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాలుగు మండలాల నుంచి నలుగురు అంగన్వాడీ కార్యకర్తలు నలుగురు ఆయాలను ఇక్కడ సత్కరించారు. అలాగే ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శాసనసభ్యుడు ని కూడా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ పోషణ మాస ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఐసిడిఎస్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సముద్రవేణి సూపర్వైజర్లు వెంకటేశ్వరమ్మ కల్పవల్లి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లి లో అంగన్వాడీ ఉత్సవం...

- పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం బంటుమిల్లి గ్రామంలో ప్రభుత్వం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం--2026 అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు గర్భిణులు బాలింతలకు అందుతున్న పోషకాహారం ఆరోగ్య సేవలు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు గర్భిణులు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సీడీపీఓ సముద్రవేణి సూపర్ వైజర్స్ కార్యకర్తలు సిబ్బంది అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఎన్ ఎస్ వి కె.దుర్గారావు బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ గా ఎన్ ఎస్ వి కె దుర్గారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీగా సేవలందించిన ఆయన,బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు కాకినాడ ఎస్డీపీవో గా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎస్డీపీవో ఎన్.ఎస్.వి.కె. దుర్గారావుకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణతో పాటు ప్రజలకు వేగవంతమైన, మెరుగైన పోలీసు సేవలు అందించేలా నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

# ప్రతి ఇంటికి సంపూర్ణ ఆరోగ్యాన్ని పంచుదాం

- డి పి ఆర్ సి రిసోర్స్ పర్సన్ బి రామ సీత



**విసన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంగా తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త హానికర చెత్త తదితరాలను గృహ ఆవాసాల నుండి బయటికి పంపే విషయంలో గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంగా అవగాహన కల్పించాలని డిపిఆర్సి రిసోర్స్ పర్సన్ బి రామ సీత తెలియజేశారు. వంద రకాలకు పైగా స్వచ్ఛ రథానికి అందించవచ్చని ఆమె చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లకు వివాహాల శుభకార్యాల సమయం లో ప్లాస్టిక్ విస్తర్లు గ్లాసులు సేకరించి సంపద సృష్టి చేయవచ్చని ఇది సమిష్టి కృషితో సాధ్యమన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శివ కుమార్, ఈవో హరికృష్ణ కుమార్, పుట్రెల ఈవో వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర యువరాజ్ మధు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి



**విస్సన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జగనన్న కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు నాగరాజు, జ్ఞాన రత్నం, ధనమ్మ తదితరులు లబ్ధిదారులతో కలిసి ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు కు వినతి పత్రం అందించారు.

# హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం



**విస్సన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో సత్తుపల్లి రోడ్డులో ఉన్న హిందూ స్మశాన వాటికను ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల ఆరోగ్య0 దృశ్య తొలి విఘ్నం గా ఉన్న చెట్టు శ్యామలను ( బుష్ కటింగ్) చేసేందుకు ఎంపీడీవో ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ జగ్గవరపు రంగారెడ్డి, లలిత సూపర్ మార్కెట్ పార్ట్నర్ కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో బతుకమ్మ సందడి!

**తొమ్మిది రోజుల పాటు ఘనంగా వేడుకలు**
**ఉత్తమ బతుకమ్మకు ప్రతిరోజూ పట్టుచీర.. మరో నలుగురికి బహుమతులు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 18 వరకు కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించనున్నారు. విద్యానగర్ కాలనీ లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి బతుకమ్మ సంబరాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ హెల్త్ డైరెక్టర్ డా. గడల శ్రీనివాసరావు పాల్గొననున్నారు. ప్రతిరోజూ అత్యుత్తమంగా అలంకరించిన బతుకమ్మకు పట్టుచీర ప్రథమ బహుమతిగా, మరో నలుగురు మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

**తేదీలు: అక్టోబర్ 10--18 సమయం: సాయంత్రం 6 గంటల నుంచి వేదిక**: జనసేన పార్టీ జిల్లా కార్యాలయం, విద్యానగర్ కాలనీ, కొత్తగూడెం సెల్: 9701048341 రండి.. బతుకమ్మ ఆడుదాం! తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుదాం!కావాలంటే హెడ్డింగ్‌ను ఇంకా "కొత్తగూడెంలో బతుకమ్మకు భారీ ఏర్పాట్లు!" వంటి మరింత ఆకర్షణీయమైన ఫ్రంట్‌పేజ్ శైలిలో కూడా మార్చవచ్చు.

# ఆర్టీసీ పరిరక్షణకు ఐక్య కూటమినే బలం

**ప్రైవేటీకరణను అడ్డుకునే సంఘాలకు కార్మికుల మద్దతు అవసరం**
**21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ।అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎంయూ, టీడబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీతో కూడిన ఐక్య కూటమిని గెలిపించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి కార్మికులకు పిలుపునిచ్చారు. కొత్తగూడెం బస్‌డిపో వద్ద ఐక్య కూటమి అభ్యర్థుల విజయాన్ని కోరుతూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల భద్రత, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడే సంఘాలకు కార్మికులు అండగా నిలవాలని కోరారు. సంస్థను ప్రైవేటీకరణ వైపు నడిపించే ప్రయత్నాలను ఎదుర్కొనేందుకు ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల అనంతరం జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రతి కార్మికుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగ భద్రత, సంస్థ పరిరక్షణతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసే ఐక్య కూటమికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# వివేకానంద నగర్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



**కూకట్‌పల్లి,అక్టోబర్8(వార్తా ప్రభ):**వివేకానంద నగర్ ప్రజల సౌకర్యార్థం రహదారి విస్తరణతో పాటు ఆర్టీసీ బస్సులు,ఆటోలు నిలిచేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. వివేకానంద నగర్ మెయిన్ రోడ్ నుంచి సర్వీస్ రోడ్‌లో ఎమ్మెల్యే గాంధీ పర్యటించి, స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ కాలనీ ప్రధాన ప్రవేశద్వారం వద్ద బస్సులు, ఆటోలు నిలిచేందుకు వీలుగా రోడ్డును కొంత మేర విస్తరించి ప్రత్యేకంగా స్టాప్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం మెయిన్ ఎంట్రన్స్ వద్ద బస్సులు, ఆటోలు నిలిచిపోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, కొత్తగా స్టాప్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యానికి రాజీ లేకుండా స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, కమిటీ సభ్యులు జి. నర్సింగరావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ,జి.ప్రసాద్, సి.కె.రెడ్డి,కె.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల సహకారం కోరిన ఏఈ

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్ మండల పరిధిలోని బేతంపూడి, జామలతండ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఏఈ కిషన్ తెలిపారు. మరమ్మతు పనుల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి.







**తొర్రూరు/పెద్దవంగర అక్టోబర్ 08 (వార్తాప్రభ):** ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు పిలుపునిచ్చారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై మండలంలోని హరిపిరాల, కర్కాల, చీకటాయపాలెం గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సన్నాహాక సమావేశం నిర్వహించారు. సీతారాములు మాట్లాడుతూ అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దసరాకు స్వగ్రామాలకు వచ్చే అర్హులను గుర్తించి ఓటు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి, యువత భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడతామని హామీ ఇచ్చారు. పట్టభద్రులంతా సమయం పాటించి ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హరిపిరాల సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు తదితరులు పాల్గొన్నారు.

**-డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు అయిన వారు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి...** డిగ్రీ పూర్తయి 3 సంవత్సరాలు అయిన వారు భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తొర్రూరు మండల భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు ఈదురు ఐలయ్య పిలుపునిచ్చారు. వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో జరగబోయే ఎంఎల్సి ఎన్నికలకు మండల పార్టీ కార్యాలయములో ఏర్పాటు చేసిన ఎంఎల్సి ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో ఎంఎల్సి ఓటు గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తయై నేటికి 3 సంవత్సరాలు అయిన వారు ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని పెద్దవంగర మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల నాయకులు శ్రీరాం సుధీర్, దుంపల సమ్మయ్య,మాజీ సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు...

# టిఓఎస్ఎస్ 10వ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి.

## - రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్..



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (వార్తప్రభ):** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో ఈనెల 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఓపెన్ 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పదో తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు 2 చీఫ్ సూపరిడెంట్స్, 2 డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్స్ 10 మందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా,పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలింపు భద్రంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలాని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి,మాల్ ప్రాక్టీసులను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్, తగిన మందులతో ఆశాలను,ఎ.యన్.యంలను అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకులు రాజేష్, ఇంచార్జ్ డి.ఈ.ఓ మందుల శ్రీరాములు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కో ఆప్షన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి..

**● బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నారనే భయంతోనే ఎన్నికలు వాయిదా. ● కేసీఆర్ భూకబ్జాలంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నరు. ● రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడివి..? : ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు..**

**తొర్రూరు అక్టోబర్ 08 (వార్తాప్రభ):** మున్సిపాలిటీల్లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దయాకర్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికై ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ప్రతి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నందున కో ఆప్షన్ పదవులు బీఆర్ఎస్‌కు దక్కుతాయనే భయంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని విమర్శించారు. తొర్రూరు మున్సిపాలిటీలోనూ బీఆర్ఎస్‌కు చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉందనే కారణంతోనే ఎన్నికల ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్లకు వారి హక్కులు కల్పించాలని, కో ఆప్షన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూముల అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఎర్రబెల్లి ఆరోపించారు. కేసీఆర్‌పై భూకబ్జాల ఆరోపణలు చేస్తూ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపుతోందని విమర్శించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రైతుబంధు, యూరియా కొరత, విద్యుత్ సరఫరా, పంట రుణమాఫీ తదితర అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.




రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. సాగునీరు అందించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు, మహిళల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలను నిలిపివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, రామిని శ్రీనివాస్, నల్లమాస ప్రమోద్ కుమార్, హనుమండ్ల ప్రదీప్ రెడ్డి, కుర్ర శ్రీనివాస్, మనిరాజు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు భూసాని జయమ్మ, ధరావత్ పద్మ, కిన్నెర కవిత, తూర్పటి రవి, జంపా, మాడుగుల భవానీలత తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

## -బిజెపి డివిజన్ అధ్యక్షులు కైతాపురం జితేందర్

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ):**అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ సూచించారు. బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్-2026లో భాగంగా హఫీజ్‌పేట్ యూత్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్ మిలన్ సేవా' కార్యక్రమం నిర్వహించారు. కేంద్రానికి వచ్చే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులను సత్కరించారు. చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బోయిని అనూష మహేష్ యాదవ్, మాణిక్ రావు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోషకాహార లోపం నివారణకు ప్రజల్లో అవగాహన పెంచాలని, ఆరోగ్యం,పరిశుభ్రతపై అంగన్‌వాడీ సిబ్బంది మరింత చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరీ, శ్రీధర్ రావు, ప్రభాకర్,



జగన్ గౌడ్, పావని కుమారి, నవీన్ కుమార్, మనోజ్ యాదవ్, హర్షిత్, రాజశేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**వార్తా ప్రభ**

# హైదరాబాద్

# కాంగ్రెస్ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

**కేసుల కారణంగా ఇబ్బందులు..**
**అధిష్టానం చొరవ తీసుకోవాలని డిమాండ్**




**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోల నేపథ్యంలో నమోదైన కేసుల కారణంగా కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎడవల్లి కృష్ణ, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ప్రస్తుతం కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, పార్టీ అధిష్టానం ప్రత్యేక చొరవ తీసుకుని రాజకీయ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెంకి శ్రీను, వీరయ్య చౌదరి, చాంద్ పాషా, లోగాని మురళి, కాప శ్రీనివాస్, రాములు నాయక్, భాను తేజ, శెట్టిపల్లి వెంకట్, కొండ వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై దాడిని ఖండిస్తూ ఎన్ఎస్ యూఐ నిరసన

**సాదుల పవన్ కుమార్ బీజేపీకి హెచ్చరిక**



**సిద్దిపేట, అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళా ఎన్ఎస్‌యూఐ నాయకులపై బీజేపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారని ఆరోపిస్తూ సిద్దిపేటలో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఆందోళనలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ బీజేపీ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళా కార్యకర్తలపై దాడికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. సిద్దిపేట బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ రాచకొండ ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మహిళా నాయకులపై దాడికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఒకవైపు 'బేటీ బచావో.. బేటీ పడావో' అంటూ నినాదాలు చేసే బీజేపీ.. మరోవైపు మహిళా కార్యకర్తలపై దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. మహిళలపై దాడికి ప్రయత్నించిన ఘటనను కేవలం రాజకీయ వివాదంగా చూడకూడదని, మహిళా సమాజంపై జరిగిన దాడిగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్సా వంశీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సనా, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రజినీతో పాటు ఎన్ఎస్‌యూఐ సుధీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కరుణాకర్, రాజిరెడ్డి,చిన్న అజ్మత్, బైరి చింటూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయండి

**-మియాపూర్ డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె రవి వినతి**



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ):**మియాపూర్ ముజఫర్ అహ్మద్‌నగర్‌లో వీధి వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను కూల్చివేయడంతో ఉపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) మియాపూర్ డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె మురళి ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. వీధి వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ సీఎంసీ కమిషనర్ సృజనతో మాట్లాడి ప్రత్యామ్నాయ స్థలం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా వీధి వ్యాపారుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు అనంతరాం, మౌలానా, విఠల్, శివ, భారతమ్మ, అనసూయ, చిట్టమ్మ, బబిత తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బియ్యం కేజీ వంద... ఏమి తిని బతకాలి ?

: బియ్యం కేజీ వంద రూపాయలు మార్క్ దాటుతోంది. ఇది నిజంగా ఆశ్చర్య పరచే విషయంగానే చూడాలి. ఎంత ధరలు పెరిగినా బియ్యం విషయంలో ఆ దూకుడు ఎపుడూ కనిపించలేదు, ఇపుడు ఎల్ నినో పుణ్యామని హద్దులు దాటేస్తోంది. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. చుక్కలు కనిపిస్తాయని చెప్పడమే తప్ప చూసినది అనుభవంలోకి వచ్చినదీ లేదు, కానీ ఇపుడు అచ్చంగా అదే పరిస్థితి ఉంది. సామాన్యుడుకి మధ్యతరగతికి చుక్కలే పట్టపగలే కనిపిస్తున్నాయి. పెరిగిన నిత్యావసరాల ధరలను చూసి బడుగు జీవులు తారెత్తుతున్నారు. ఏమి కొనేటట్టు లేదు ఏమి తినేటట్లు లేదు అన్నది మళ్లీ పాడుకోవాల్సిన దారుణమైన పరిస్థితులు వచ్చేశాయి. ఈ రోజున మార్కెట్ లో చూస్తే బియ్యం ధరలు బంగారం ధరలతో పోటీ పడుతున్నాయి. బంగారం అయితే మోజు తగ్గించుకుంటారు, కొనడం మానేసుకుంటారు. కానీ బియ్యం ధరలు పెరిగితే ఎలా. ఇంట్లో పొయ్యి మీద గిన్నెలో బియ్యం ఉడికేది ఎలా. ఇది కదా సాధారణ జనం వేదన. సాధారణ సన్నబియ్యం ధరలు కూడా పరుగులు తీస్తూ పట్టుకోమని సవాల్ విసురుతున్నాయి. ఎక్కడో కాదు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా బియ్యం ధరలు భారీగా పెరిగాయి. దాంతో సంచి డబ్బులతో బజారు కెళ్ళి జేబులకు సరిపడ సరుకు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.అన్నమో రామచంద్రాయేనా : ఈ దేశంలో ఇప్పటిదాకా అన్నానికి కొరత అయితే లేదు, ఎందుకంటే అవసరానికి మించి ధాన్యం పంట పండుతూ వచ్చింది. చాలా సందర్భాలలో వరి పండించవద్దు అని పాలకులే సూచించే నేపథ్యం ఉంది. కానీ ఈసారి అలా కాదు, ఎల్ నినో ప్రభావంతో ఒక్కసారిగా దిగుబడి తగ్గిపోయింది. దాంతో ధరలు కూడా పెరిగిపోతున్నాయి. సాధారణ సన్న బియ్యం ధర చూస్తే గత నాలుగు నెలల క్రితం కిలో యాభై రూపాయల నుంచి 55 గా ఉంటే ఇపుడు అది ఏకంగా 85 రూపాయల దాకా ఎగబాకేసింది. దాంతో బియ్యం ధరను చూస్తే షాక్ తినాల్సి వస్తోంది అని సాదర జనం గోడు పెడుతున్నారు. ఇక తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాలలో పండుగ సీజన్ నాటికి కొన్ని రకాల బియ్యం ధరలు కిలో ఏకంగా వంద రూపాయలు దాటే అవకాశం ఉందని మిల్లు యజమానులు ఇప్పటి నుంచే అంచనా వేస్తున్నారు. అదే సమయంలో బాస్మతి వంటి ప్రీమియం రకాల ధరలు ఇప్పటికే కిలో 130 నుండి 240 పైనే పలుకుతున్నాయి. ఇంతలా ధరలు పెరగడానికి కారణం ఏమిటి అన్నది చూస్తే దిగుబడి తగ్గడం అన జవాబు వస్తోంది. ఎల్‌నీనో ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల వరి సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడి పెద్ద ఎత్తున తగ్గిపోయింది. అలాగే మార్కెట్‌లో ధాన్యం నిల్వలు తగ్గడంతో ఓపెన్ మార్కెట్‌లో మిల్లు యజమానులు ఎక్కువ ధర పెట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా చెబుతున్నారు. ఎరువులు, కూలీల ఖర్చులు రవాణా ఛార్జీలు పెరగడం కూడా రిటైల్ ధరలపై ప్రభావం చూపుతోంది అని అంటున్నారు. ప్రభుత్వాలు అయితే సగటు రేటును నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నప్పటికీ అంతగా ఫలితాన్ని ఇవ్వడం లేదు, బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం ధరలు మాత్రం వంద మార్క్ ని తాకేస్తున్నాయి. దీంతో గంజి నీళ్ళకు అయినా గతి ఉంటుందా అన్నది సామాన్యుడు వేస్తున్న ప్రశ్న.

## వ్యర్థాలతో కళాత్మక వస్తువుల తయారీపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలను కేవలం చెత్తగా పారవేయకుండా వాటితో కళాత్మక వస్తువులను తయారు చేసి పునర్వినియోగించుకునే విధానంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాజీవ్ గాంధీ పార్కులో వ్యర్థాలతో తయారు చేసిన ఆర్ట్ క్రాఫ్ట్‌ను ప్రదర్శిస్తూ అవగాహన స్టాల్‌ను అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యర్థాలను కేవలం వ్యర్థాలుగా భావించి పడేయకుండా, వాటిని కళాత్మక వస్తువులుగా, ఇంట్లో అలంకరణకు మరియు ఇతర అవసరాలకు ఉపయోగపడే వస్తువులుగా మార్చుకోవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఈ అవగాహన స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవడం ద్వారా రీయూజ్ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు.రాజీవ్ గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన ఈ అవగాహన స్టాల్‌ను ప్రజలందరూ సందర్శించి, వ్యర్థాల నుంచి కళాత్మక వస్తువులను ఎలా తయారు చేయాలి, వాటిని ఇంట్లో అలంకరణకు లేదా ఇతర అవసరాలకు ఎలా ఉపయోగించుకోవచ్చు అనే అంశాలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ విధానాలను తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని కోరారు.వ్యర్థాలను పునర్వినియోగించుకోవడం ద్వారా వ్యర్థాల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, తద్వారా రెడ్యూస్ , రీ యూస్ , రీసైకిల్ విధానాల్లో భాగంగా వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చని తెలిపారు.

# విజయవాడ అర్బన్ నగరాల సంఘం నూతన కార్యాలయం ప్రారంభం...





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ అర్బన్ నగరాల సంఘం నూతన కార్యాలయాన్ని శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు పోతిన బేసు కంటేశ్వరుడు, శ్రీ నగరాల సంఘం అధ్యక్షులు నల్లాని సూర్యారావు గురువారం ప్రారంభించారు. చిట్టినగర్ గూడెల రాములు వీధిలో నూతన కార్యాలయం ప్రారంభం అనంతరం విజయవాడ అర్బన్ నగరాల సంఘం ప్రతినిధులు సంఘ పెద్దలను సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్బంగా పోతిన బేసు కంటేశ్వరుడు, నల్లాని సూర్యారావు మాట్లాడుతూ విజయవాడ అర్బన్ నగరాల సంఘం రజతోత్సవ వేడుకల్లో భాగంగా సంఘ జెండా ఆవిష్కరణ తోపాటు కార్యాలయ ప్రారంబించిన్నట్లు పేర్కొన్నారు.నూతన అధ్యక్షుడిగా పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), కార్యదర్శిగా ఈది అజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగోతి సింహాద్రి, గౌరవ అధ్యక్షుడిగా శంబాని దుర్గారావు ఎన్నిక కావటం సంతోషంగా ఉందన్నారు.నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.నూతన అధ్యక్షుడు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా) మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఎలాంటి చందాలు, విరాళాలు సేకరించకుండా సభ్యుల సొంత నిధులతో పేద విద్యార్థులకు సహాయం, పుస్తకాల పంపిణీ, వైద్య శిబిరాలు, వనభోజనాలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలోవిజయవాడ అర్బన్ నగరాల సంఘం కోశాధికారి పిళ్ళా చంద్రశేఖర్,నగరాల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శీరం వెంకట్రావుతో పాటు పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు .

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

### భవానిపురం పాత 41వ డివిజన్‌లో స్థానిక మాజీ కార్పొరేటర్ ఎండి. ఇర్ఫాన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భవానిపురం, పాత 41వ డివిజన్ పరిధిలో హరిజనవాడ, అవుట్ ఏజెన్సీ, రంగూన్ సాహెబ్ వీధి, ప్రెసిడెంట్ వీధి, మసీదు వీధి తదితర ప్రాంతాలలో స్థానిక మాజీ కార్పొరేటర్ ఎండి. ఇర్ఫాన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక పోరుకు సిద్ధం -- ప్రజా సమస్యలపై యుద్ధం! డివిజన్ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు, కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరియు వివిధ హోదాలలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని డివిజన్‌లోని వీధుల్లో కలియదిరిగి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరియు నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డివిజన్ పర్యటనలో భాగంగా వార్డు అంతటా పర్యటించగా పారిశుద్ధ్య వ్యవస్థ అత్యంత దుర్మార్గంగా, దౌర్భాగ్యంగా తయారైందని వెలంపల్లి మండిపడ్డారు. ప్రతి ఇంటి ముందూ మురుగునీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం రోడ్లు ఊడ్చే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులకు ప్రజల కష్టాలు ఏమాత్రం పట్టడం లేదని వెలంపల్లి ఎద్దేవా చేశారు. ఏసీ రూముల్లో కూర్చొని ప్రెస్ మీట్లు పెట్టడం కాదని, దమ్ముంటే ఒక్కసారి ఈ హరిజనవాడ వీధుల్లోకి వచ్చి ప్రజల అవస్థలు, డ్రైనేజీల దుస్థితిని కళ్లారా చూడాలని సవాల్ విసిరారు. ఇళ్ల ముందు నీళ్లు నిలబడి బయటకు రాలేని పరిస్థితులు ఉంటే, వర్షం వస్తే ఈ సందుల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఆలోచించాలని అన్నారు. డివిజన్‌లో ప్రతి ఒక్కరూ తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గోడు వెళ్లబోసుకుంటున్నారని వెలంపల్లి అన్నారు. పక్కనే కృష్ణా నదిని పెట్టుకుని ఈ ప్రాంత ప్రజలకు గుక్కెడు తాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'వాటర్ మ్యాన్' అని బిరుదులు తగిలించుకోవడం కాదని, ముందు ప్రజల దాహం తీర్చడానికి తాగునీరు అందించాలని హితవు పలికారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే వాటిని అదుపు చేయడంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద అక్కచెల్లెమ్మలకు నిడమర్రు (అమరావతి ప్రాంతం)లో పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేస్తూ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు కక్షపూరితంగా పేదలకు ఇచ్చిన ఆ స్థలాలను, ఇళ్లను రద్దు చేయడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో ఖాజాభాయ్ (62 సం.) అనే కరడుగట్టిన టీడీపీ అభిమానే స్వయంగా వచ్చి తన బాధను వ్యక్తం చేశారని వెలంపల్లి తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు, రెండున్నరేళ్లు దాటినా తనకు అర్హత ఉన్నప్పటికీ పింఛన్ ఇవ్వడం లేదని ఆయన వాపోయారని చెప్పారు. ప్రభుత్వంపై పార్టీలకు అతీతంగా ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో చెప్పడానికి ఇదొక ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక టీడీపీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్యే, ఎంపీలకు ఇక్కడ ఒక హరిజనవాడ ఉందని, అవుట్ ఏజెన్సీ ప్రజలు ఉన్నారని అసలు తెలుసా అని నిలదీశారు. పక్కనే 'విజయవాడ ఉత్సవ్' పేరిట వేడుకలు జరుపుతూ చందాలు, దందాల వసూళ్లతో జేబులు నింపుకోవడానికే కూటమి నాయకులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పక్కనే ఉన్న పేదల కాలనీల దుస్థితి వీరికి కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం లేదు, అభివృద్ధి లేదు, కనీస నిర్వహణ (మెయింటెనెన్స్) కూడా లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి నాయకులకు ప్రజలు నూటికి నూరు శాతం గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాగానే నిడమర్రు, అమరావతిలో పేదలకిచ్చిన స్థలాలను తిరిగి అప్పగించి, అక్కడే పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని వెలంపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# భారీగా తెలుగుదేశం పార్టీలో చేరిన ఎస్.కే. ఖాజా, చెవుల ఆంజనేయులు బ్రదర్స్

**రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో**
**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నికి చెందిన**
**నాయకులు 200 మందితో టీడీపీలో చేరిక**
**పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో**
**ఘనంగా చేరికల కార్యక్రమం**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారీగా పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది.రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్.కే. ఖాజా , ప్రముఖ పారిశ్రామికవేత్త చెవుల ఆంజనేయులు బ్రదర్స్ తమ అనుచరులతో కలిసి సుమారు 200 మందితో తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. ఎస్.కే. ఖాజా , చెవుల ఆంజనేయులు బ్రదర్స్ తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ముందుకు సాగుతోందని, పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో వివిధ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యం** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిసి, సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత , రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ , రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్కె అబ్దుల్ అజీజ్ , గ్రంధాలయ చైర్మన్ ఎమ్ ఎస్ బేగ్ , మరియు వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పత్రాల అందజేత

**కూటమి నేతలతో కలిసి అందజేసిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్.**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**ప్రధానమంత్రి ఆవాస్ యోజన -2.0 పథకం ద్వారా అర్హులైన 36 మందికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో మంజూరు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనసేన పార్టీ 42 వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన -2.0 ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో 36 మంది లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలను అందజేసినట్లు తెలిపారు.సొంతింటి కల నెరవేరుతున్న కుటుంబాలకు వారు శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కూటమి నేతలు పేర్కొన్నారు.పీ ఎం ఏ వై 2.0 కింద కేంద్రం నుంచి రూ 1.50 లక్షలు రాష్ట్రం నుంచి రూ 1 లక్ష సహాయం అందుతుందని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ విజయవాడ డివిజన్ ఈ ఈ, జీ కపూర్ అన్నారు. రానున్న రోజుల్లో మరి కొంతమంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు...డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ పిచ్చయ్య, ఎ ఈ కే రాజేష్... కూటమి నాయకులు పత్తి నాగేశ్వరరావు, దాడి అప్పారావు,బెన్నా భక్తుల సోమేశ్వరరావు, పులిచేరి రమేష్, రౌతు వాసు, విశ్వంశెట్టి విశ్వేశ్వరరావు, జయబాలన్, పల్లంటి ఆది, బాదర్ల శివ, శనివారపు శివ, నాగోతి రామారావు, పోతినిడి లోకేష్, కొప్పుల గంగాధర్, కొమర కిరణ్, బొమ్ము రాంబాబు తదితరులు పాల్గొన్నారు...

# టిడిపి లో చేరిన విజయవాడ మైనారిటీ నేత షేక్ ఖాజా

**ఖాజా మనస్సుని గాయ పరచింది ఎవరు**
**రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టరు గా ఎనలేని సేవలు**
**పశ్చిమ లో వైసిపీకి ఖాజా నిర్ణయం ఎదురు దెబ్బే**



**యేమినేని వెంకట రమణ**

**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమలో వైసిపీ కి ఖాజా కోలుకోలేని దెబ్బ తీశాడని పలువురు సీనియర్ రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం మైనార్టీ వర్గాల్లో మంచి పట్టున్న ఖాజా వైసిపీ రాజీనామా చేసిన విషయం వైసిపీ కి షాక్ ఇచ్చినట్టు ఐయ్యింది. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు కి ఇదేంతో ఎదురు దెబ్బే. వెల్లంపల్లి కి నమ్మిన బంటు లా ముద్ర పడిన ఖాజా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మాజీ మంత్రికి మింగుడు పడని విషయమే.ఇలాంటి తరుణంలో పుండు పై కారం చల్లిన చందంగా ఖాజా తెదేపాలో చేరడం వైసిపీ సీనియర్ నాయకులకు మింగుడు పడ్డంలేదు. మొత్తానికి ఖాజా కి వైసిపీ లో ఎవ్వరో నాయకులు మనస్తాపం చెందేలా ప్రవర్తించారనే ప్రచారం జరుగుతుంది. రానున్న స్థానిక సంస్థాగత ఎన్నికల్లో ఖాజా పార్టీ మారడం తెలుగు దేశం పార్టీ మేలు జరుగుతుందని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న నేతృత్వంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మైనారిటీ నేత ఖాజా టిడిపి లో చేరారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గ మైనారిటీ నేతగా ప్రజల్లో మంచి ఆదరణ గుర్తింపు ఉన్న ఖాజా చేరికతో మైనారిటీ లో టిడిపి మరింత పట్టు సాధించే అవకాశం వుంది. ఐతే ముస్లిం మైనార్టీ నాయకుల్లో ఈ అంశం చర్చనీయంగా మారింది.ఖాజా తనవెంట ఇంకెంత మందిని తెదేపాలోకి తీసుకెళతాడోననే గుబులు వైసిపీ నాయకుల్లో నెలకొందని చెప్పొచ్చు

**రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలకు స్థల పరిశీలించిన**

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయనున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ మరియు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం ఆంధ్ర లయోలా కాలేజ్ ఆడిటోరియంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఎంసీ అడిషనల్ కమిషనర్ జనరల్ మరియు ఎలక్షన్ నోడల్ ఆఫీసర్ ఏ. రవీంద్రరావుతో కలిసి కేంద్రాల ఏర్పాట్ల స్థలంను సమీక్షించారు.విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జరగనున్న 86 వార్డుల మరియు మేయర్ ఎన్నికల నేపథ్యంలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను స్థలం అనుగుణంగా ఉందా లేదా అని పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.ముందుగా కేంద్రాల మ్యాప్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. ప్రభుదాస్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఆర్ఎస్ఓ సీహెచ్. రత్నబాబు, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## 11 న ఎస్ .హెచ్.ఓ.లో" ప్రోస్టేట్ గ్రంధి వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

**-అతి తక్కువ ఖర్చుకే ప్రోస్టేట్ గ్రంధి పరీక్షలు"**

**గుంటూరు టౌన్ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థసంయుక్తంగా ప్రతినెల రెండో ఆదివారం స్పెషలిస్టుల ఉచితవైద్య శిబిరాల లో భాగంగా 11 వ తేదీ ఆదివారం "ప్రోస్టేట్ గ్రంధి వ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ "నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ , వి.వి. నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ . హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రోస్టేట్ గ్రంధి వ్యాధుల వైద్య, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ డి వి. మాధవరావు పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి ముందు ప్రోస్టేట్ గ్రంధి వాపు -- నిర్ధారణ చికిత్స, (బి పి హెచ్) ప్రోస్టేట్ క్యాన్సర్ తదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందన్నారు. అంతేకాక ప్రజాప్రయోజనార్థం అక్టోబర్ 9వ తేదీ నుండి 31వ తేదీ వరకు అతి తక్కువ ఖర్చుతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ , పి .ఎస్. ఏ, ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రొఫైల్ పరీక్షలను అందిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు.

# చిరు వ్యాపారులకు తక్షణమే రుణాలు మంజూరు చేయాలి

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్**

**మచిలీపట్నం అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**వెనుకబడిన తరగతులు (బీసీ), కాపు, ఈడబ్ల్యూఎస్ తదితర వర్గాలకు చెందిన పేద చిరు వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రుణాలను తక్షణమే మంజూరు చేయాలని కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఈడీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం ప్రకటించిన పథకాల కింద చిన్నతరహా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు సబ్సిడీ రుణాల కోసం వేలాది మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే దరఖాస్తులు స్వీకరించి ఇంతకాలం గడిచినా



ఇప్పటివరకు రుణాలు మంజూరు కాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కృష్ణా జిల్లా వ్యాప్తంగా బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, రాజు తదితర వర్గాలకు చెందిన సుమారు 2,000 మందికి పైగా పేదలు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చిరు దుకాణాలు, చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగించే వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. రుణాలు అందితే చిన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు కుటుంబాలకు స్థిరమైన ఉపాధి లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి దరఖాస్తుదారుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన బీసీ కార్పొరేషన్ ఈడీ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగి శివ, కోమటి శ్రీను, పెద్ది సాంబశివ, భోగిరెడ్డి సుభాని, గౌర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పుస్తకాల ఆవిష్కరణ



**ఆగిరిపల్లి, అక్టోబర్ 8 (వార్తా ప్రభ దినపత్రిక):** ఆగిరిపల్లి మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పోటీ పరీక్ష మెటీరియల్‌ను గురువారం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ లక్ష్మణ్‌రావు రూపొందించిన మెటీరియల్‌ను ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. మండలంలోని ఏడు పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అర్హులని మండల విద్యాశాఖ అధికారి ఎం. సత్యనారాయణ తెలిపారు. పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల స్కాలర్‌షిప్ లభిస్తుందని పేర్కొన్నారు. ఏడు ఉన్నత పాఠశాలలకు సుమారు 100 పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఎంఈఓ--2 కొవ్వలి ఆనంద్‌కుమార్, జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఎం. రత్నకమలబాబు తదితరులు పాల్గొన్నారు

## .శ్రీవిద్యాంజలి హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ చికిత్స శిక్షణ



విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి) డా.మాకాల సత్యనారాయణ తో విద్యార్థులకు వివిధ ఆరోగ్య సమస్యలు.. వాటి నివారణకు తీసుకునే చర్యలు గురించి గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు తెలియజేసారు. ఈకార్యక్రమాన్ని డాక్టర్ రాయ్ ఫస్ట్ ఎయిడ్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో వివిధ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎన్ టీ ఆర్ జిల్లా అధ్యక్షులు డా. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా హార్ట్ ఎటాక్, జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, పాము కాటు మొదలైన అంశాల పై నివారణ ఉపాయాలు తెలిపారు. దీనితో పాటు విద్యార్థులశీ అందరికి మోడీ హెల్త్ స్టిక్ అందజేశారు. ఈ స్టిక్ ఉపయోగించే విధానం ద్వారా ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీ ఉదయ్ కుమార్, కే పవన్ కళ్యాణ్, కే దుర్గాప్రసాద్, తవ్వా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి 166 దరఖాస్తులు

**మైలవరంలో ముగిసిన మూడు రోజుల "సేవా సేతు అభియాన్" క్యాంపెయిన్**



**మైలవరం అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)** :ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా ఆపరేషన్ సబ్ డివిజన్ మైలవరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. సుధాకర్ ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణ లో ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రత్యేక "సేవా సేతు అభియాన్" క్యాంపెయిన్ గురువారం ముగిసింది. ఈ మూడు రోజుల క్యాంపెయిన్ లో 166 మంది ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి దరఖాస్తు చేసుకున్నారని మైలవరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.సుధాకర్ తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు కోసం ఏపిఎస్ గ్రూప్స్ సోలార్ పవర్,నేషనల్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రికల్స్, సాక్షి సోలార్, ఏఆర్ కెఎ సోలార్ కంపెనీలకు చెందిన వెండర్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని వెల్లడించారు.

## పసి పిల్లలు -సిరి మల్లెలు



చిన్నారి పసి పిల్లలు
సుతిమెత్తని సిరిమల్లెలు
అందాలకు అందమే
మదిని దోచే పల్లెలు
ఇంటిలోన దీపాలు
ప్రేమకు ప్రతిరూపాలు
అందరికీ కడు ఇష్టులు
ముద్దులొలుకు చిన్నారులు
మచ్చ లేని చిన్నారులు
చూడ ఆణిముత్యాలు
వారి నోట నిరంతరము
ప్రవహిస్తుంది సత్యము
గగనమంత హృదయాలు
వికసించిన కుసుమాలు
పిల్లల మనస్తత్వము
మంచు వోలె నిర్మలము
తెలియవులే కుతంత్రాలు
చేయరులే మోసాలు
శ్రేష్టమైన పసివారు
మంచి మనసు ఉన్నవారు
అహింస మార్గం ఇష్టము
ఆటలంటే ప్రాణము
వారి మనసే శ్రేష్టము
విలువైన బంగారము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,9966414580.

## సమస్యలు పరిష్కరించుకుందాం.. కలిసి ముందుకు సాగుదాం

**- విలేజ్‌లో పెన్షనర్లకు ఇంటి స్థలాల కేటాయింపుపై సీఎం సానుకూల స్పందన**

**తిరుపతి, అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)** టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘంలో నెలకొన్న పరిణామాలపై ఇటీవల ఓ దినపత్రికలో 'విశ్రాంతిలో అశాంతి' శీర్షికన వచ్చిన వార్తకు స్పందించిన సంఘం కమిటీ, ఈ అంశంపై సమగ్రంగా చర్చించి కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 25న సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎ.వి.ఎల్. నారాయణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘానికి సంబంధించిన అన్ని అంశాలను కూలంకషంగా చర్చించారు. సంఘం అధ్యక్ష పదవికి ఆర్. ప్రభాకర రెడ్డి, జనరల్ సెక్రటరీ పదవికి శ్రీ యస్. ముని రెడ్డి సమర్పించిన రాజీనామాలను ఉపసంహరించుకోవాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని వారికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. సంఘం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, కమిటీ నిర్ణయాన్ని గౌరవిస్తూ, విశ్రాంత ఉద్యోగుల నుంచి వాట్సాప్ ద్వారా వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ 7న నిర్వహించిన కమిటీ సమావేశానికి శ్రీ ఆర్. ప్రభాకర రెడ్డి హాజరయ్యారు. తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులను సభ్యులకు వివరించిన అనంతరం, అధ్యక్ష



పదవికి సమర్పించిన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో సభ్యులందరూ హర్షం వ్యక్తం చేశారు. జనరల్ సెక్రటరీ శ్రీ యస్. ముని రెడ్డి తన అభిప్రాయాన్ని లేఖ ద్వారా కమిటీకి తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆర్. ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ, గత నెలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు విచ్చేసిన ముఖ్యమంత్రి దృష్టికి పల్లం విలేజ్ వద్ద పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల కేటాయింపు అంశాన్ని తీసుకెళ్లి వివరించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అక్కడే ఉన్న టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్‌లను ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు సభ్యులకు వివరించారు. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఎ.వి.ఎల్. నారాయణను కన్వీనర్‌గా నియమించినట్లు టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది.

## ప్రజా సమస్యల పై పోరాడే కమ్యూనిస్టులను గెలిపించండి

**సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి వి కృష్ణ**

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 08(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను బలపరిచి గెలిపించాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డి వి కృష్ణ పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అమలు చేయడంలో విఫలమైందని , ప్రభుత్వాన్ని చిత్త శుద్ధి తో ప్రతిపక్ష వైసిపి ప్రజా సమస్యలపై పని చేయాలని , ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులను ప్రజల ఆదరించి చట్టసభల్లోకి పంపితే ప్రజా సమస్యలపై అధికార పార్టీని నిలదీసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలు ఆదిశగా ఆలోచించాలని సూచించారు. పెరిగిన నిత్యవసర ధరలు ఆకాశాన్ని తాకిన తగ్గిచటం లో కేంద్ర బిజెపి , రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు ప్రజల నెత్తిన భారాలు తప్ప చేసిందేమీ లేదన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ను అడ్డుపెట్టుకుని 13 కోట్ల ఓట్లు తొలగించటం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసి రాజీ చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10 న అఖిలపక్ష ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ జయప్రదం చేయాలని




పిలుపునిచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీ లో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించటం లో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని తక్షణమే నూతన పైప్ లైన్లు ఏర్పాటు వేగవంతం చేసి ఇబ్రహీంపట్నం, కొండపల్లి ఊరిలో మంచినీరు బురద నీళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ సి హెచ్ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం సిపిఎం మండల కార్యదర్శి యం మహేష్, పట్టణ కమిటీ సభ్యులు ఎ విఠల్ రావు, వి ఇ కొండలరావు, ఎస్ కె బాషా, ఎల్ పార్వతి, కె బేబీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు అభినందనలు

**గొల్లపూడిలో కూటమి నాయకుల బైక్ ర్యాలీ శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



**విజయవాడ రూరల్, అక్టోబర్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని ప్రధాని మోదీ కు అభినందనలు తెలిపారు. ప్రజాసేవకు అంకితమైన నాయకత్వానికి గుర్తుగా నిర్వహించిన ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గారు దేశాభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తుచేసుకున్నారు. ర్యాలీ అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు చేయూతే లక్ష్యం.

**సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ ఆధ్వర్యంలో రూ.40.82 లక్షల రుణాల పంపిణీ 17 మంది చిరు వ్యాపారులకు రూ.14.50 లక్షల 'వ్యాపార సువిధా' రుణాలు**



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 8( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలో గురువారం చిరు వ్యాపారులు, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేలా పెనుగంచిప్రోలు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ ఆధ్వర్యంలో రుణ సదుపాయాల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పీఏసీఎస్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సహకారంతో చిరు వ్యాపారులకు రుణ చెక్కులను పంపిణీ చేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం కృషితో, కర్ల వెంకటనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన తోపుడు బండ్లపై, చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ఎలాంటి షూరిటీ లేకుండా 'వ్యాపార సువిధా' రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన 17 మంది చిరు వ్యాపారులకు రూ.14.50 లక్షల రుణాలను అందించారు. అదేవిధంగా పీఏసీఎస్ ద్వారా 8 మంది రైతులకు రూ.10.72 లక్షల పంట రుణాలు, రైతునేస్తం కింద ఇద్దరికి రూ.15.60 లక్షల రుణాలు అందించారు. మొత్తం రూ.40.82 లక్షల రుణాలను లబ్ధిదారులకు అందించారు.

**చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధి పై కర్ల వెంకటనారాయణ దృష్టి** పెట్టారు, ఈ సందర్భంగా కర్ల వెంకటనారాయణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవించే కుటుంబాలకు బ్యాంకు రుణాలు అందుబాటులోకి తీసుకురావడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. చిన్న మొత్తంలో పెట్టుబడితో వ్యాపారం చేసుకునే వారికి సరైన సమయంలో ఆర్థిక సహాయం అందితే వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు చిరు వ్యాపారులకు కూడా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలను తెలియజేసి, అర్హులైన వారికి వాటిని చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా గ్రామంలోని రైతులు, చిరు వ్యాపారులకు అందుబాటులో ఉండే విధంగా సహకార సంఘం సేవలను విస్తరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

**నెట్టెం రఘురాం మాట్లాడుతూ...**చిరు వ్యాపారులకు ఎలాంటి షూరిటీ లేకుండా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. చిన్న వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడం ద్వారా వారి వ్యాపార అవసరాలకు ఆర్థిక సహకారం అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

**పోలంపల్లి డ్యామ్ చైర్మన్ పొన్నం బాలాజీ మాట్లాడుతూ...**చిరు వ్యాపారులు, రైతులకు రుణ సదుపాయాలు అందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకారం అందుతుందని పొన్నం బాలాజీ అన్నారు. రుణాలను వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కోపరేట్ బ్యాక్ మేనేజర్ దుర్గా ప్రసాద్,మాజీ ఎంపిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి మాజీ జెడ్ పి టీ సి గజ్జి కృష్ణ మూర్తి జిల్లా టీడీపీ కార్యదర్శి గింజుపల్లి రమేష్ బాబు సొసైటీ కార్యదర్శి యలమందల నరసింహారావు మాజీ కార్యదర్శి కొండలశర్మ సొసైటీ డై రెక్టర్ కనపర్తి శ్రీనివాసరావు టీడీపీ నాయకులు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చిరు వ్యాపారులు, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు...

## దృష్టి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి




**మచిలీపట్నం అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు డాక్టర్ ఏవీఎస్ లక్ష్మి దృష్టి దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం నేత్ర వైద్యురాలు డాక్టర్ అమృత నేత్ర వైద్య విభాగంలోని వార్డులో, బాహ్య రోగుల విభాగంలో రోగులకు దృష్టి లోపాలపై అవగాహన కల్పించారు. దృష్టి లోపాలకు కారణాలు, వాటిని ముందుగానే గుర్తించడం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో దృష్టి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి. భానుమూర్తి, డాక్టర్ శివాని, నేత్ర సహాయక అధికారి శ్యాంబాబు, ఇబ్రహీం, దృష్టి కొలత నిపుణుడు అన్వేష్‌తో పాటు నేత్ర వైద్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహంలో అన్నదానం నిర్వహించిన మయూరి శ్యామ్ యాదవ్ దంపతులు



**గూడూరు, అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు జీవన్ దాన్ ఆర్గాన్ డోనార్ లి(అవయవ దానం డోనార్ ) డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృతమ్ తో గుడూరు పట్టణం గమళ్ళపాలెంలో ఉన్న ఓం సాయిరాం వసతి గృహంలోని నిరాశ్రయలకు నెలలో వకరోజు క్రమం తప్పకుండా జరిగే అన్నదాన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ మీరందరూ వృద్ధులు కనుక ఆరోగ్య విషయాలలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ డాక్టర్స్ సలహాలు పాటించి ఆందోళన చెందకుండా మనస్సును నిర్మలంగా ఉంచుకుంటూ మీ జీవితాలను ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ తను చేయు సేవా కార్యక్రమాలకు ఆ దేవ దేవుడు శ్రీ కృష్ణ పరమాత్మడు ఆశీస్సులు నా తల్లిదండ్రులు దివంగత బండి కృష్ణయ్య , బండి వనమ్మ ల దీవెనలుతో పాటు మయూరి స్వీట్స్ మరియు వనజా కృష్ణ కళ్యాణమండపం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతున్నదని మయూరి శ్యామ్ యాదవ్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ వారి సతీమణి మహేశ్వరి , వృద్దులు పాల్గొన్నారు......

## ముగిసిన పోషకాహార మహోత్సవాలు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):** వారం రోజులుగా జరుగుతున్న పోషకాహార మహోత్సవాలు గురువారం ముగిసాయి. ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలో ఇబ్రహీంపట్నం లో జరిగిన ముగింపు కార్యక్రమానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులకు మూడు సంవత్సరాల్లోపే బిడ్డ మెదడు 85% ఎదుగుదల ఉంటదని, గర్భిణీ స్త్రీ తీసుకోవాల్సిన ఆహారము, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వేడి ఆహారం గురించి సమాజ భాగస్వామ్యం గురించి వివరించారు. తల్లి బిడ్డల క్షేమం కోసం సూచించిన విధంగా ఆహార నియమాలు పాటించాలని, వారికి పూర్తి అవగాహన కల్పించేందుకు పోషకాహార వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, బిజెపి పట్టణ అధ్యక్షురాలు తమ్మినైనా మాధురి, బిజెపి నాయకులు పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు హెల్పర్లలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ రాజేశ్వరరావు, కిరణ్ కుమార్, సూపర్వైజర్ మాధవి శివకుమారి అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్స్ తల్లులు పాల్గొన్నారు.

## విద్యార్థుల తో కలసి భోజనం చేస్తున్న హెచ్.యం. నక్కా బాబురావు.



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 8( వార్త ప్రభ )** మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు లో స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లలతో (విద్యార్థులు)కలిసి భోజనం చేస్తూన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు నక్కా బాబూరావు,విద్యార్థులకు భోజనాలు రుషికరమైన కూరలు తో మంచిగా పెడుతున్నారా లేదా..? అన్ని ప్రతి రోజు ప్రాదానోపాధ్యాయులు బాబురావు సహబంతి భోజనాలు విద్యార్థుల తో కలసి భోజనం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు బాబురావు కు అభినందనలు తెలుపు తున్నారు..

# నగరాలను “బీసీ డీ నుంచి బీసీ ఏ”లోకి మార్చాలి

-రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర డిమాండ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ):**సగరులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసాపేట్‌లో సగర సంఘం అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సగర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సగరుల ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా వెంటనే వర్గీకరణ చేయాలని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మోడల రవి సగర, ఆవుల వెంకటరాముల సగర, దిండి శేఖర్ సగర, అతినారపు విజయలక్ష్మి సగర, సుర జయమ్మ సగర, అస్కాని గాయత్రి సగర, కురుమూర్తి సగర, కృష్ణ సగర తదితరులు పాల్గొన్నారు.

# అభ్యసన సామాగ్రి పంపిణీ హర్షణీయం

యుటిఎఫ్ చే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**పెనుగంచిప్రోలు – అక్టోబర్ 8( వార్త ప్రభ )** వివిధ ఉపాధ్యాయ సంఘాలు పిల్లల విద్యా ప్రమాణాల పెంపుదల కోసం అభ్యసన సామాగ్రి అందజేయటం సంతోషకరమైన విషయం అని పెనుగంచిప్రోలు లోని స్వామి పుల్లయ్య మె మో రియల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబురావు అన్నారు. కృష్ణా గుంటూరు జిల్లాల మాజీ శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణ్ రావు సౌజన్యంతో గురువారం నాడు పెనుగంచిప్రోలు బాలికల ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల తరపున జాతీయ మీన్స్ అండ్ మెరిట్స్ పారితోషక పరీక్షలకు హాజరయ్యే దాదాపు 20 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలు అందజేయడం జరిగింది. పెనుగంచిప్రోలు మండలం యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చాగర్ల రామారావు, ఎస్ కే ప్రైమర్ లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా తమ యూనియన్ ఈ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నదని పదవ తరగతి విద్యార్థులకు కూడా పరీక్షల సమయంలో అభ్యసన సామాగ్రి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, వేగినేటి వెంకటరమణ, గజ్జి శ్రీనివాస్, ఉష, సైరాబాను, శ్రీదేవి, వెంకటేష్ , గ్రేసీ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవరంలో 20 ఏళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం!

ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి, అక్టోబర్ 8 (వార్తా ప్రభ దినపత్రిక):** ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గ్రామస్తులతో ఆరుబయట కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, 20 ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సుమారు కిలోమీటర్ దూరం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు వివరించగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పిలిపించి సమస్య పరిష్కారానికి అయ్యే వ్యయంపై వివరాలు తెలుసుకున్నారు. కిలోమీటరుకు సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుందని అధికారులు తెలపడంతో, ఉన్నతాధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏళ్లుగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను కూడా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. యాదవ సోదరులు కోరిన గొర్రెల పెంపక రుణాల మంజూరుపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ యువత కోరడంతో రూ.2,500 విలువైన వాలీబాల్ కిట్‌కు వెంటనే నిధులు అందించారు. సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకున్న మంత్రికి గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నతానియేలు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి,అక్టోబర్ 8 (వార్తా ప్రభ దినపత్రిక):** కృష్ణవరం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త వి. నతానియేలు మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతుని భార్యతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి ప్రభుత్వం తరఫున, తన తరఫున అవసరమైన అండదండలు అందిస్తామని హామీ ఇచ్చారు.టీడీపీకి నతానియేలు అందించిన సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు.ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అవసరమైన సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.మంత్రి వెంట గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సగరులను బీసీ ‘ఎ’ లోకి మార్చాలి

ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు...





**కూకట్ పల్లి,అక్టోబర్ 8(వార్తప్రభ):**రాష్ట్రంలో ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు లోనైన సగర కులాన్ని బి.సి డి నుంచి ఏ లోకి మార్చాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మూసాపేట్ సగర సంఘం అధ్యక్షులు మోడల శ్రీనివాస్ సగర అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికంగా చతికిలబడ్డ సగరులు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో రాణించాలంటే బీసీఏ లోకి మార్చాలని ఉప్పరి శేఖర్ సగర అన్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ఎన్టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సగరులను బిసి డి నుంచి ఏలోకి మారుస్తూ జీవో 166 ను విడుదల చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు సగరుల జీవితాలలో ఎలాంటి మార్పు లేదని, ఆర్థికంగా వెనుకబాటుకు అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా సగరులను వెంటనే బీసీ డి నుంచి ఏ లోకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్తులో జాతి మొత్తం సంఘటితంగా పోరాటం కొనసాగిస్తుందని వెల్లడించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మూసాపేట్ సగర సంఘం అధ్యక్షులు మోడల శ్రీనివాసగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోడల రవి సగర, ఆవుల వెంకటరాముల సగర, సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దిండి శేఖర్ సగర, రాష్ట్ర సగర మహిళా సంఘం అధ్యక్షురాలు అతినారపు విజయలక్ష్మి సగర, ప్రధాన కార్యదర్శి సుర జయమ్మ సగర, కోశాధికారి అస్కాని గాయత్రి సగర, సీనియర్ నాయకులు కురుమూర్తి సగర, కృష్ణ సగర తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసానికా.. వికాసానికా?

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

-టీడీపీ అధికార ప్రతినిధి నలమోలు వెంకట శివరామ ప్రసాద్..



**పెనుగంచిప్రోలు – అక్టోబర్ 8( వార్త ప్రభ )** రాబోవు ఎన్నిక ల్లో ఓటు వేసే ముందు ప్రజలు తమకు కావాల్సింది విధ్వంసమా... వికాసమా అనేది ఆలోచించుకోవాలని టీడీపీ అధికార ప్రతినిధి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం నలమోలు వెంకట శివరామ ప్రసాద్ సూచించారు. ప్రజా శ్రేయస్సు, అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంత వాతావరణం కోసం పనిచేసే నాయకత్వాన్ని ప్రజలు ఎంచుకోవాలని ఆయన కోరారు.ప్రజలను రక్షించే నాయకులు కావాలా.. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నాయకులు కావాలా?, ప్రజా హక్కులను కాపాడేవారికి ఓటు వేయాలా.. వాటిని హరించే వారికి ఓటు వేయాలా అనే విషయాలను ప్రజలు బేరీజు వేసుకోవాలని అన్నారు. ప్రజల అభివృద్ధిని పరమావధిగా భావించే నాయకత్వం కావాలా.. స్వప్రయోజనాల కోసం ప్రజలను వంచించే నాయకత్వం కావాలా అనేది నిర్ణయించుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు.అభివృద్ధి, వికాసం, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే నాయకత్వం ప్రశాంతత, నిరుద్యోగ నిర్మూలన, కుటుంబ ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకత్వాన్ని ప్రజలు కోరుకోవాలని శివరామ ప్రసాద్ అన్నారు. సానుకూల దృక్పథంతో పనిచేసే వారికి మద్దతు ఇవ్వాలా.. ప్రతికూల రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చేవారికి మద్దతు ఇవ్వాలా అనే అంశంపై ప్రజలు ఆలోచించాలని సూచించారు.అప్పులు చేస్తూ ప్రజలకు తాత్కాలిక ప్రయోజనాలు కల్పించడం కాకుండా, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఆర్థిక వనరులను వినియోగించే విధానాన్ని ప్రజలు పరిశీలించాలన్నారు. ఒక లక్ష్యం, ఒక విధానం, ఒక విజన్‌తో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేసే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు.భవిష్యత్ తరాల కోసం విజన్ అవసరం,రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విజన్–2047 వంటి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగే నాయకత్వం అవసరమని ఆయన అన్నారు. రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్ అందించేందుకు 24 గంటలూ పనిచేసే పాలన కావాలా.. రోజుకో మాట మార్చే రాజకీయాలు కావాలా అని ప్రజలు నిర్ణయించుకోవాలని కోరారు.అమరావతి, పోలవరం వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతికి కీలకమని పేర్కొంటూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకత్వాన్ని ప్రజలు ఎంచుకోవాలని అన్నారు. అవినీతి, హింసకు వ్యతిరేకంగా ఓటు వేయాలి..అవినీతి, హింస, భూకబ్జాలు, రౌడీ సంస్కృతి వంటి రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని శివరామ ప్రసాద్ పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసే నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.రాముని సేన కావాలా.. రావణుని సేన కావాలా? రామరాజ్యం కావాలా.. రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చే పాలన కావాలా? అనే విషయాలను ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు.

**ఓటు హక్కును ఆలోచించి వినియోగించాలి**ప్రజల ఆస్తులు, హక్కులపై పెత్తనం ఇతరులకు అప్పగించాలా? లేక వాటిని కాపాడుకునే నాయకత్వాన్ని ఎన్నుకోవాలా? అనే విషయాన్ని ప్రతి ఓటరూ ఆలోచించాలని శివరామ ప్రసాద్ అన్నారు.దేవుడు ప్రత్యక్షమై స్వర్గమా.. నరకమా అని అడిగితే ప్రతి ఒక్కరూ స్వర్గాన్నే కోరుకుంటారని, అదే విధంగా ప్రజల జీవితాల్లో అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంతత తీసుకొచ్చే పాలనను ఎంచుకోవాలని సూచించారు.బ్రతికుండగానే నరకాన్ని చూపించే రాజకీయాలను కాకుండా ప్రజలకు మంచి భవిష్యత్ అందించే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించాలని టీడీపీ అధికార ప్రతినిధి నలమోలు వెంకట శివరామ ప్రసాద్ పిలుపునిచ్చారు.

# మనసు మాటను ముందే గుర్తించే ‘కాగ్నిపైజ్’

- మానసిక ఒత్తిడిని ముందుగానే గుర్తించే దిశగా మెడికల్ ఏఐ పరిశోధకుడు కిషోర్ కుమార్ కొర్చిపాటి ప్రయోగాత్మక ప్రయత్నం



**తిరుపతి: అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను ప్రజలు తమంతట తాము ముందుగానే గుర్తించేందుకు సాంకేతికతను ఉపయోగించాలనే లక్ష్యంతో మెడికల్ ఏఐ పరిశోధకుడు కిషోర్ కుమార్ కొర్చిపాటి రూపొందించిన ‘కాగ్నిపైజ్’ అనే ప్రైవసీ–ఫస్ట్ డిజిటల్ పరిశోధనా వేదిక ప్రయోగాత్మకంగా ముందుకు సాగుతోంది.మానసిక ఆరోగ్య సమస్యలను సూచించే పదాలను రోజువారీ సంభాషణల్లో అవమానకరంగా ఉపయోగించడం వల్ల వాటిపై అపోహలు, భయాలు పెరుగుతున్నాయని పరిశోధకుడు పేర్కొంటున్నారు. వాస్తవానికి మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ, తాము ఆ పరిస్థితిని ఎదుర్కొంటున్నామని చాలామంది గుర్తించలేకపోతున్నారని తెలిపారు.కాగ్నిపైజ్‌లో భాగంగా సుమారు 20 సెకన్ల ఏకాగ్రత, రిథమ్ వ్యాయామం నిర్వహిస్తారు. ఇందులో సమయపాలన, స్థిరత్వం, సమన్వయం వంటి ప్రవర్తనా అంశాలను పరిశీలించి ప్రయోగాత్మకంగా ‘అటెన్షన్ ఇండెక్స్’ను రూపొందిస్తారు. అయితే ఇది వైద్య నిర్ధారణ కాదని, క్లినికల్‌గా ధ్రువీకరించిన కొలమానం కాదని స్పష్టం చేశారు. ఒక నిర్దిష్ట సమయంలో వ్యక్తి తన ఏకాగ్రత, ప్రవర్తనా సరళిని స్వయంగా




గమనించుకునేందుకు ఇది ఒక సాధనంగా మాత్రమే ఉపయోగపడుతుంది.శ్వాసాభ్యాసం, గ్రౌండింగ్, కదలికలు వంటి ‘రిసెట్’ కార్యకలాపాలతో వినియోగదారులు కొంత సమయం విరామం తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు. అలాగే ‘ప్యాటర్న్ ఇన్‌సైట్స్’, ‘సెషన్ హిస్టరీ’, ‘కామ్ బై అవర్’, వ్యక్తిగత బేస్‌లైన్స్ వంటి అంశాల ద్వారా తమ అలవాట్లు, ఏకాగ్రత సరళులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.ఇప్పటివరకు విద్యార్థులు, వైద్యులు, వృత్తి నిపుణులు, వివిధ రంగాల నిపుణులతో నిర్వహించిన పరీక్షల్లో 600కు పైగా పరిశీలనలు, స్పందనలు సేకరించినట్లు తెలిపారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, దానిపై సహజమైన చర్చకు అవకాశం కల్పించడం కాగ్నిపైజ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.భారతీయ సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి మానసిక ఆరోగ్య పరిశోధనకు వేదికగా భారత్‌ను తీర్చిదిద్దాలన్నది దీర్ఘకాలిక లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రయోగానికి వివిధ రంగాల నిపుణులు, పరిశోధకులు, సంస్థల నుంచి లభించిన సూచనలు, సహకారం కీలకంగా నిలిచాయని కిషోర్ కుమార్ కొర్చిపాటి తెలిపారు.

# చంద్రగిరి నియోజకవర్గంలో 50,273 మంది ఓటర్ల పునఃపరిశీలనకు శ్రీకారం : బి. రామమోహన్

**చంద్రగిరి: అక్టోబర్ 8:(వార్తా ప్రభ ప్రతినిధి)**చంద్రగిరి శాసనసభ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గుర్తించిన 50,273 మంది ఓటర్ల వివరాలను ఇంటింటికీ వెళ్లి పునఃపరిశీలించే కార్యక్రమానికి బూత్ స్థాయి అధికారులు శ్రీకారం చుట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన వారి పేర్లను తొలగించేలా చర్యలు చేపడుతున్నట్లు ఓటర్ల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి బి. రామమోహన్ తెలిపారు.15 జూన్ 2026 నుంచి 24 జూలై 2026 వరకు నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరునామాల్లో అందుబాటులో లేకపోవడం, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు కావడం, తగిన ఆధారాలు లభించకపోవడం తదితర కారణాలతో 50,273 మంది ఓటర్లు తమ చిరునామాల్లో అందుబాటులో లేరని గుర్తించారు.అనంతరం 31 జూలై 2026న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఈ జాబితాలో మొత్తం 2,63,522 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితా అనంతరం చేపట్టిన పరిశీలనలో 6 అక్టోబర్ 2026 నాటికి మరో 6,281 మంది ఓటర్లు ఓటర్ల జాబితాలో చేరేందుకు అర్హులుగా గుర్తించారు. వీరిని తుది ఓటర్ల జాబితాలో చేర్చే ప్రక్రియ కొనసాగుతోంది.తుది ఓటర్ల జాబితాను 16 అక్టోబర్ 2026న ప్రచురించనున్నట్లు అధికారులు తెలిపారు. తుది జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులు అనంతరం నిరంతర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చూడటమే ఈ పునఃపరిశీలన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రామమోహన్ తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన వారు, కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన వారు సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు.ఇంటింటి పరిశీలనలో భాగంగా ఓటర్ల వివరాలు, చిరునామాలు, కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు పరిశీలించి అవసరమైన ఆధారాలను సేకరించనున్నారు. ఓటర్లందరూ అధికారులకు సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని రామమోహన్ కోరారు.

# ఘనంగా గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు.



**కూకట్ పల్లి, అక్టోబర్ 8(వార్తా ప్రభ)**శేర్లింగంపల్లి బిజెపి సీనియర్ నాయకులు గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు శుక్రవారం కొండాపూర్ లో రెడ్సన్ హోటల్లో ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ కార్యకర్తలు మధ్య జన్మదినకి వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా యోగానంద మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు మధ్య చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాస్ , శ్రీనివాసరెడ్డి,పలువురు సీనియర్ కార్యకర్తలు, అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## సిడిపి ఓ సత్యవతి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలు ముగింపు



**పెనుగంచిప్రోలు – అక్టోబర్ 8( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ పరిధిలోని పెనుగంచిప్రోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం. 12నందు ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి ఆధ్వర్యంలో గురువారం పోషణ మాస ఉత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సత్యవతి మాట్లాడుతూ గర్భవతులకు బాలింతలకు పౌష్టిక ఆహారం గురించి అంగన్వాడీ లో ఇచ్చే గుడ్లు పాలు బాలామృతం లో ఉండే పోషక విలువల గురించి వివరించి తల్లులకు మునగాకు జ్యూస్ లాగా తీసుకోవడం వల్ల ఐరన్ శాతం పెరుగుతుందని ఆకుకూరలు ఎక్కువగా తీసుకోమని నవచేతన స్క్రీనింగ్ మిషన్ వాత్సల్య పథకం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం గురించి వివరించారు.రాగిజావ చిరుధాన్యాలతో అనేక రకమైన వంటకాలు చేసుకోవచ్చని వివరించారు. చిరుధాన్యాలతో ఆకుకూరలతో వంటకాలు చేసి రాగిజావ తల్లులకు డెమో చేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు7నుండి 3 సంవత్సరాలు తల్లులు, సిడిపి ఓ సత్యవతి సూపర్వైజర్స్ రజిని జ్వాల వెంకట కుమారి అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్స్ పాల్గొన్నారు...

# కూకట్ పల్లి బతుకమ్మ ఉత్సవాలు.



**కూకట్ పల్లి, అక్టోబర్ 8(వార్తా ప్రభ):**ఈ సంవత్సరం అమావాస్య రెండు రోజులు ముందు బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు సాయంత్రం సమయంలో కూకట్ పల్లి గ్రామంలో పలుచోట్ల మరియు కూకట్పల్లి హనుమాన్ దేవాలయం వద్ద సాయంకాలం ఐదు గంటల నుండి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అక్కడ ఆటలు ఆడిన తర్వాత బతుకమ్మలను పిఎన్ఎం స్కూల్ గ్రౌండ్ వద్ద మళ్లీ బతకమ్మలాడి తదనంతరం రంగదాముని చెరువులో నిమజ్జనం చేస్తారు అని, అక్కడ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యవేక్షించి అధికారులకి ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ బతుకమ్మలు ఆడేందుకు వచ్చే ప్రతి ఆడపడుచులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మున్సిపల్ శాఖ మరియు పోలీసు శాఖ వారికి కోరడం జరిగింది.18.10.26 తారీకున పెద్ద బతుకమ్మ ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతాయని బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# లాడ్జి ల నిర్వహణ, నియంత్రణ పై పోలీసుల కౌన్సిలింగ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ):**లాడ్జిల నిర్వహణ, నేరాల నియంత్రణపై చందానగర్ పోలీసులు లాడ్జి యజమానులు, మేనేజర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.లాడ్జిలో బస చేసే వారి గుర్తింపు పత్రాలను పరిశీలించి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.లాడ్జిల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఫుటేజీని భద్రపరచాలని సూచించారు.మైనర్లు, అనుమానాస్పద వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా గదులు ఇవ్వడం, మాదకద్రవ్యాల వినియోగం, వ్యభిచారం తదితర అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వరాదన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గుడివాడలో రూ.69.40 కోట్లతో అభివృద్ధి పనులు..

## -30 ఏళ్లకు తాగునీటి కొరతకు చెక్ : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడ తాగునీటి వసతుల మెరుగుకు అమృత్ 2.0 కింద రూ.22.50 కోట్లు, సెంటు స్థలాల ఎన్టీఆర్ కాలనీలో వాటర్ ట్యాంక్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కు రూ.10.90 కోట్లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మరో రూ.36 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రాబోయే 30 ఏళ్ల వరకు గుడివాడలో తాగునీటి సమస్య లేకుండా సమగ్ర డిజైన్ రూపొందిస్తున్నామని, పట్టణ విస్తరణ, భవిష్యత్ జనాభాను దృష్టిలో పెట్టుకుని సమ్మర్ స్టోరేజ్, ఓవర్ హెడ్ ట్యాంకులు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నిధులు ఉన్నా సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం జరుగుతోందని, బేతవోలు, నాగవరప్పాడు చెరువులు, రైల్వే గేట్ల వద్ద పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించి బ్రేక్ లేకుండా పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, పబ్లిక్ హెల్త్, ఏపిజీబీసీ అధికారులు, పిడిఎంఎస్ నిపుణుడు టి.ఆంజనేయులు, ఏపీ వేర్ హౌసింగ్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లవల్లేరు వైసీపీకి షాక్

## -జనసేనలో చేరిన మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ



**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడి మాజీ సర్పంచ్ కొత్తూరి లక్ష్మీనారాయణ వైసీపీని వీడి జనసేనలో చేరారు. గురువారం ఉదయం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట సుమారు 50 మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లా డుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధికి ఆకర్షితులై జనసేనలో చేరానని, గుడివాడ నియోజకవర్గంలో శ్రీకాంత్ నాయకత్వంలో తన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ లాంటి సీనియర్ నాయకులు పార్టీలో చేరడం శుభపరిణామమని, సర్పంచ్ గా ఉన్న ఆయన అనుభవం పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, షేక్ మీరా షరీఫ్, సుంకర వెంకట్, షేక్ నాగూర్ భాష, వంగలపూడి రాము, వైఎస్సార్, లోయ రాజా, సాయి పవన్, సూదాబత్తుల వెంకటేష్, కందికొండ దర్గా, జాజుల సురేష్, వీరమహిళలు గేదెల కళ్యాణి, కనకదుర్గ, కల్పన, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో నిరసన ర్యాలీ.. !




**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** సర్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శ్రామిక హక్కుల పోరాట సంఘం, నవ జవాన్ భారత్ సభ సంయుక్త ఆధ్వర్యంలో గుడివాడ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకుడు రఘు మాట్లాడుతూ.. సర్ విధానం ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా పలు రాష్ట్రాల్లో ఎన్నికలను తారుమారు చేశారని ఆరోపిస్తూ, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను రద్దు చేసి, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని రఘు కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికల విధానంలో పారదర్శకత తీసుకురావాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు తమ్మిశెట్టి లక్ష్మణరావు, సురేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఏఎన్ఆర్ కళాశాలలో విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమం -మాక్ డ్రిల్



**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణ, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం మరియు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు, అత్యవసర సమయాల్లో అనుసరించాల్సిన విధానాలను అధికారులు విద్యార్థులకు వివరించారు. వివిధ రకాల ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, వాటిని ఏ విధమైన అగ్ని ప్రమాదాలకు ఎలా ఉపయోగించాలి అనే అంశాలను ప్రాయోగికంగా ప్రదర్శించారు. విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్ని ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించడం, సురక్షితంగా బయటపడటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విపత్తుల సమయంలో అప్రమత్తత, అగ్ని భద్రతపై అవగాహన, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యాలు పెంపొందించబడ్డాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జె.ఎస్. కుమార్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జేసు బాబు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ అంజనేయులు, శ్రీరామమూర్తి, ఫణి పాల్గొన్నారు. ఫైర్ సిబ్బంది విద్యార్థులకు స్వయంగా శిక్షణ ఇచ్చి, మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో హాస్పిటల్ కమిటీ, వైద్య సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ముఖ్యమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**రక్తదానం.. ప్రాణదానంతో సమానం..** రక్తదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడగలదని ఎమ్మెల్యే సౌమ్య గారు పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా సమాజంలో మానవతా విలువలు మరింత బలపడతాయని అన్నారు.

**నందిగామ హాస్పిటల్‌కు స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు..** ఎన్టీఆర్ జిల్లాలో స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు అందుకున్న నందిగామ డివిఆర్ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీకి, వైద్యులకు మరియు సిబ్బంది ఎమ్మెల్యే సౌమ్య అభినందనలు తెలిపారు. ఆసుపత్రి పరిశుభ్రత, నిర్వహణ, రోగులకు అందుతున్న సేవల్లో సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు. అలాగే మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఉత్తమ సేవలు కనబరిచిన ఉత్తమ నర్స్ అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా అభినందించారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది సమష్టి కృషితోనే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలను బలోపేతం చేస్తూ నందిగామ డివిఆర్ ఏరియా హాస్పిటల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మరిడమ్మ తల్లి అమ్మవారి మాలధారణ వస్త్రాలు విడుదల



**పెద్దాపురం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** పెద్దాపురం మరిడమ్మ తల్లి అమ్మవారి మాలధారణ కార్యక్రమానికి సంబంధించిన నూతన వస్త్రాలను కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మరియు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు గురువారం కాకినాడలోని కాకినాడ ఎంపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఆలయ నిర్వహణాధికారిణి కే. విజయలక్ష్మి, వేద పండితుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన శ్రీ మరిడమ్మ తల్లి అమ్మవారి మాలధారణ సంప్రదాయాన్ని భక్తుల కోరిక మేరకు పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావడానికి ఆలయ దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణాధికారిణి కే. విజయలక్ష్మి మాట్లాడుతూ.. పెద్దాపురం శ్రీ మరిడమ్మ తల్లి అమ్మవారి మాలధారణ సంప్రదాయం కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిందని తెలిపారు. భక్తుల కోరిక మేరకు 2026 అక్టోబర్ 11వ తేదీ నుంచి శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాలధారణ చేసే భక్తులు తొమ్మిది రోజుల పాటు నియమ నిష్ఠలతో మాలను ధరించి, విజయ దశమి మరుసటి రోజు మాల విరమణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అమ్మవారి మాలధారణ చేయదలచిన పెద్దాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఆలయం వద్ద తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ మరిడమ్మ తల్లి అమ్మవారి మాలధారణ సంప్రదాయాన్ని పునరుద్ధరించడం ఎంతో గొప్ప కార్యక్రమమని అన్నారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, జనసేన నాయకులు నెక్కంటి సాయి ప్రసాద్, పన్నీర్ వెంకటేశ్వరరావు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరం మాజీ సీఐ అహ్మద్ అలీ పెద్దకర్మ : నివాళులర్పించిన ప్రముఖులు, విలేకరులు



**గన్నవరం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** గన్నవరం పోలీస్ స్టేషన్‌లో గతంలో సీఐగా విధులు నిర్వహించి అందరి ఆదరాభిమానాలు పొందిన దివంగత అహ్మద్ అలీ పెద్దకర్మ కార్యక్రమం గోపన్నపాలెంలో అత్యంత వేడుకగా, సద్భావనా వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గన్నవరం నియోజకవర్గం నుండి పలువురు అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అహ్మద్ అలీ గన్నవరంలో సీఐగా పనిచేసిన కాలంలో శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవ, ప్రజలతో మరియు విలేకరులతో కలిగి ఉన్న మైత్రి బంధాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గం నుండి మీడియా మిత్రులు కలపాల కరుణాకర్, మక్బూల్ బాషా, దావీదులతో పాటు గతంలో గన్నవరం సీఐగా సేవలు అందించిన వినయ్ మోహన్, కోమాగుల శివాజీ, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లలో పనిచేసిన పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

# వైసీపీ గెలుపునకు అగ్నికుల క్షత్రియులు కృషి చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలి
- నామినేటెడ్ పదవుల్లో అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత ఇవ్వాలి
- 2029 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ విజయానికి పనిచేయాలి





**అమలాపురం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్ క్లబ్‌లో అగ్నికుల క్షత్రియుల వైసీపీ నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. వైసీపీ ఆర్టీఐ ఐటీ జోన్-2 రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు త్రినాథ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వైసీపీ మత్స్యకార నాయకులు, అగ్నికుల క్షత్రియుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అగ్నికుల క్షత్రియులకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించేందుకు అగ్నికుల క్షత్రియులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నామినేటెడ్ పదవుల భర్తీలో తమ సామాజికవర్గాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మత్స్యకారుల సంక్షేమం, ఉపాధి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఆర్టీఐ ఐటీ జోన్-2 రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు త్రినాథ వర్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారుల ఉపాధి, అభివృద్ధి కోసం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మత్స్యకారులకు, అగ్నికుల క్షత్రియులకు తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ప్రజలు ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ఆ వ్యతిరేకత స్పష్టమవుతుందని అన్నారు. బీసీల్లో రెండవ స్థానంలో ఉన్న అగ్నికుల క్షత్రియులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు కోరారు. తమ సామాజికవర్గానికి రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారులంతా వైసీపీ వెంటే ఉన్నారని నాయకులు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడంతో పాటు, 2029 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ విజయానికి అగ్నికుల క్షత్రియులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వైసీపీ మత్స్యకార నాయకులు, అగ్నికుల క్షత్రియుల నాయకులు, పార్టీ కార్యకర్తలు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి



**విస్సన్నపేట,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గ పరిధిలో విస్సన్నపేట మండలంలో నియోజకవర్గానికి ఈశాన్య ప్రాంతంలో ఉన్న బజరంగబలి వీర హనుమాన్ ఆలయంలో అంగరంగ వైభవంగా తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు వేద పండితులు నిర్వహించిన బ్రహ్మ ముహూర్తంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీసీల హక్కులు ఆత్మగౌరవం రాజకీయ ప్రతినిత్యం కోసం నియోజకవర్గంలో కొండపర్వ గ్రామం నుండి నెమలి వరకు ఆయన నిర్వహించిన బైక్ ర్యాలీలో పలుచోట్ల బీసీ ఆడపడుచులు రంగురంగుల పూల జల్లుల మధ్య మంగళ హారతులతో స్వాగతం పలికారు. బీసీలకు రాజకీయ గుర్తింపు తెచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఏపీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు 34 శాతం పెంచారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు అన్యాయం జరగకుండా కూటమి ప్రభుత్వం జీవోలు జారీ చేసి శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. ఈ భారీ ర్యాలీలో నియోజకవర్గం పరిధిలో పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా వర్దిరెడ్డి విశ్వేశ్వరరెడ్డి



**అనంతపురం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాప్తాడుకు చెందిన వర్దిరెడ్డి విశ్వేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# క్వాలిఫైడ్ వైద్యులకు శిష్యులే ఆర్ఎంపి పిఎంపీ లు

## -ఐలా మాజీ చైర్మన్, లింగం ప్రసాద్



**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** లింగవరం గ్రామంలో కెవిఆర్ ప్రథమ చికిత్స కేంద్రం ను లింగం ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన అక్కడకు విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాత్రనకా, పగలనకా కుగ్రామాలలో ప్రజలకు అత్యవసర ప్రాథమిక వైద్య అవసరాన్ని ఆర్ఎంపీలు తీరుస్తున్నారన్నారు. క్వాలిఫైడ్ వైద్యుల వద్ద శిష్యులుగా పనిచేసిన అనుభవంతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం ఎన్ని రకాలుగా విలేజ్ క్లినిక్కు, పీహెచ్సీ సెంటర్లు ఏర్పాటు చేసినా ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారన్నారు. ప్రథమచికిత్స కేంద్రం నిర్వహకురాలు కుమ్మరి శిరీషను అభినందించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్య సంఘాల నాయకులు కోలా వెంకటేశ్వరరావు, సాగిరాజు ఉదయ భాస్కరరాజు, గుదే నాగ చంద్రశేఖర్ (నాని), కుమ్మరి భావన్నారాయణ, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో చైతన్యం అవేర్‌నెస్..

- విశ్వభారతి విద్యార్థులకు పోలీసుల అవగాహన



**గుడివాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** చైతన్యం అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా గుడివాడ డీఎస్పీ పాలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విశ్వభారతి స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ వార్డు నంబర్-2 పరిధిలోని విద్యార్థులకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు, చదువుపై ఏకాగ్రత, సైబర్ నేరాలు, జువైనల్ జస్టిస్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, మైనర్ డ్రైవింగ్ నేరం, గంజాయి, మత్తు పదార్థాల వాడకం, వాటి నియంత్రణపై వివరించారు. అలాగే పోక్సో చట్టం, 112 హెల్ప్‌లైన్, ఈగల్ టీమ్, శక్తి టీమ్స్, ఎస్ఓఎస్ యాప్ సేవలు, మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# బాపులపాడు బడికి వరుస విజయాలు





**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విభాగంలో జిల్లాస్థాయి అవార్డు సాధించి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న బాపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాస్‌ను అభివృద్ధి కమిటీ, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులు అండర్--19 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని అభినందించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్, అక్కినేని రాఘవేంద్రరావు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కట్టా నరేంద్ర రూ.4 వేల ఆర్థిక సహాయం అందించగా, యునైటెడ్ ఫెడరేషన్‌కు చెందిన బి. భాగ్యరాజు క్రీడా దుస్తులను అందించారు. అనంతరం విద్యార్థులను కమిటీ ప్రతినిధులు అభినందించారు.

# 2027 మార్చి నాటికి భూసమస్యలు లేని రాష్ట్రం లక్ష్యం

## - మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** 2027 మార్చి నాటికి భూసమస్యలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లి, వట్టిగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. నూజివీడు నియోజకవర్గానికి వీబీ--జీరామ్‌జీ ద్వారా అదనంగా రూ.25 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామసభలో ప్రజలు తెలిపిన సమస్యలను నాలుగు నుంచి ఆరు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కనసానపల్లిలో కమ్యూనిటీ హాల్, వట్టిగుడిపాడులో 200 మందికి ఇళ్ల పట్టాలు, రహదారుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేసి, ఈ--కేవైసీ అనంతరం పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని చెప్పారు. పాసుపుస్తకంలోని క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలు, స్కెచ్, రూట్ మ్యాప్, శాటిలైట్ ఇమేజీని తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలామ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రూ.19 కోట్ల హెచ్ ఏ ఎం నిధులతో నందిగామ అభివృద్ధికి మరో ముందడుగు

- 7, 8, 9వ వార్డుల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన
- పట్టణ మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** నందిగామ పట్టణ అభివృద్ధిలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్( హెచ్ ఏ ఎం)ద్వారా మంజూరైన రూ.19 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని 7, 8, 9వ వార్డుల్లో నిర్మించనున్న వివిధ సీసీ రోడ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మున్సిపల్ కమిషనర్, అధికారులతో పాటు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ, నందిగామ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు నిత్యావసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచడమే ప్రాధాన్యతగా పనులు చేపడుతున్నామని తెలిపారు. హెచ్ ఏ ఎం ద్వారా వచ్చిన రూ.19 కోట్ల నిధులతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 7, 8, 9వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిగామ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులను సమకూర్చి, అభివృద్ధి పనులను కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే సౌమ్య అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతూ నందిగామను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్ణీత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు -- నందిగామ పట్టణ ప్రగతికి ప్రభుత్వం కట్టుబాటు అనే దిశగా ఈ కార్యక్రమం కొనసాగింది.

# సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు..

- దేశం నలుమూలల నుంచి నుంచి 600 స్టాళ్ల వరకు ఏర్పాటు
- నాణ్యవంతమైన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన
- స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. గౌరవ రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గౌరవ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

# మారువేషంలో వెళ్లారు.....జూదగాళ్ళ ఆట కట్టించారు

- వెల్లటూరులో చిత్తులాట ఆడుతున్న 8 మంది అరెస్ట్
- రూ.21,710 లు నగదు,8 వాహనాలు స్వాధీనం



**జి.కొండూరు,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామ శివారులో కొంతమంది చిత్తులాట ఆడుతున్నారని సమాచారం రావడంతో జి.కొండూరు సబ్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి మారువేషంలో వెళ్లి మెరుపు దాడి చేసి జూదగాళ్ల ఆట కట్టించారు. చిత్తులాట ఆడుతున్న 8 మంది ని అరెస్టు చేసి వారి నుంచి 8 వాహనా లు,రూ.21,710 లు నగదు స్వాధీనం చేసుకున్నారు. జి.కొండూరు,మైలవరం,రెడ్డిగూడెం మండలా ల పరిధిలో చిత్తులాట (కాయిన్ గేమ్) జూదం నిర్వహిస్తున్న ముఠాపై గత కొంతకాలంగా వ్యక్తిగతంగా నిఘా ఉంచడం జరిగిందని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి 8వ తేదీ గురువారం మధ్యాహ్నం 1.00 గంటల సమయంలో వెల్లటూరు గ్రామ శివారు చల్లాపల్లమ్మ గుడి సమీపంలో దాడి చేసి జూదం ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నామని తెలియ జేశారు. పట్టుబడిన వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, మోటారు వాహనాలతో పాటు జూదంలో ఉపయోగించిన నాణేలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెల్లడించారు. ఈ కేసును జి.కొండూరు పోలీస్ స్టేషన్ నందు ఎ.పి.జూదం నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు.

### జూదం ఆడే ముగ్గురు వ్యక్తులపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేశాం : సీఐ కె.కిషోర్ బాబు

జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాల పరిధిలో జూదం నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్నామని,వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జూదం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నా యని, దీనిని ఇప్పటికే జి.కొండూరు పరిధిలో జూదం ఆడే ముగ్గురు వ్యక్తులపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జరిగిందని తెలియజేశారు. మరికొంతమంది వ్యక్తులపై కూడా షీట్లు ఓపెన్ చేయనున్నామని తెలిపారు. వీరే కాకుండా, వ్యవస్థీకృతంగా జూదం నిర్వహిస్తూ అమాయక ప్రజల కుటుంబాలను నాశనం చేస్తున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ కింద జైలుకు పంపడంతో పాటు, జూదం ద్వారా సంపాదించిన ఆస్తులను కూడా స్వాధీనం (సీజ్) చేస్తామని గట్టిగా హెచ్చరించారు. చిత్తులాట దాడిలో పాల్గొన్న జి.కొండూరు ఎస్.ఐ కె. సతీష్ కుమార్ ని మరియు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- సుంకరి సూర్యం, యు.వి.భాస్కర్, వి.వి. రమణమూర్తిలపై కేసులుతో పత్రికా స్వేచ్ఛపై దాడి
- జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- జిల్లా కలెక్టర్ కు వినతి






**విశాఖపట్నం,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** జర్నలిస్టులు సుంకరి సూర్య నారాయణ (సూర్యం), యు. వి. భాస్కర్, వి.వి. రమణమూర్తిలపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. వార్తలు రాస్తే కేసులు పెడతారా.. అక్రమ కేసులు ఎత్తివేయాలి.. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుందాం.. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి.. జిల్లాస్థాయి అటాక్స్ నివారణ కమిటీలు ఏర్పాటు చేయాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ ఎన్ ఏ) అధ్యక్షుడు పి. సత్యనారాయణ మాట్లాడుతూ వార్తలు రాస్తున్న జర్నలిస్టుల హక్కులను కాలరాస్తూ పత్రిక స్వేచ్ఛకు హరిస్తున్నారని దుయ్యబట్టారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ లో ఆ ముగ్గురు జర్నలిస్టులపై నమోదు చేసిన కేసును(ఎఫ్ ఐ ఆర్ నెం. 246/2026) తక్షణమే ఎత్తివేయాలని కోరారు. ఈ కేసులో ఈ నెల 4న రాత్రి సమయంలో మఫ్టీలో వచ్చిన పోలీసులు అనారోగ్యంతో ఉన్న సుంకరి సూర్యనారాయణను ఆయన కుటుంబ సభ్యులకు కేసుకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా తీసుకొని వెళ్లారన్నారు. మరుసటి రోజు సాయంత్రం కోర్టులో హాజరు పరిచి, పోలీసు అధికారులే జడ్జి దగ్గర కూర్చుని బెయిలు రాకుండా చేయటమేమిటని మండి పడ్డారు. సూర్యం ఇంట్లో శుభకార్యం త్వరలో ఉందని చెప్పినప్పటికీ స్టేషన్ బెయిలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేశారని వాపోయారు . అనారోగ్యం వల్ల జైలులో ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు. ఒకవైపు జర్నలిస్టుల రక్షణ కొరకు హోంమంత్రి చైర్ పర్సన్ గా హైపర్ కమిటీలు ఏర్పడితే మరొకవైపు జర్నలిస్టులపై ఈ తప్పుడు కేసులు ఏంటనిప్రశ్నించారు . ఫిర్యాదుదారుడైన మల్లవరపు శ్రీనివాసరావు, మల్లవరపు వినీత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు, నమోదైన ఎఫ్ఐఆర్, ప్రాథమిక దర్యాప్తులోఎక్కడా డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసిన ఆధారాలు లేవని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు ఈఎన్ఎస్ బాలు మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలంలోని ధారపాలెంలో సర్వేనెంబర్ 8/4లో ఏ.వి. బిల్డర్స్ సంస్థ నిర్మించి అపార్ట్ మెంట్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని పలు స్థానిక పత్రికలు వార్తలు రాయడంతో పాటు, పలువురు జీవీఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో నెల రోజుల కిందట ఆ అపార్ట్మెంట్ పై రెండు ఫ్లోర్లు తొలగించాలని బిల్డర్ కు నోటీసు ఇవ్వడంతో పాటు వాటికి రంధ్రాలు పెట్టారన్నారు. అదే విషయాన్ని లీడర్ పత్రికలో ప్రచురిస్తే దాన్ని పక్కదారి పట్టిస్తూ ఆ పత్రిక ఎడిటర్ వి.వి .రమణమూర్తి, స్టాఫ్ రిపోర్టర్ యు. వి.భాస్కర్ లతోపాటు సూర్య పత్రిక స్టాఫ్ రిపోర్టర్ సూర్యం పైన తప్పుడు కేసు నమోదు చేయటం దారుణం అన్నారు. కేసుకు ఆధారంగా ఉన్న సూర్యం మొబైల్ మెసేజ్ లలో అభియోగంలోని అంశాలు ఏమీ లేవని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు మల్లవరపు శ్రీనివాసరావు మరొక వ్యక్తికి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీల విషయంలో మధ్యవర్తిగా జర్నలిస్టు సూర్యం ఉన్నారని చెప్పారు. ఆ వ్యక్తికి ఇవ్వాల్సిన డబ్బు పంపించు అని సూర్యం మూడు నెలల కిందట మెసేజ్ పెడితే వారం రోజుల కిందట కేసుకు ముడిపెట్టి, వక్రీకరించి ఈ ముగ్గురు జర్నలిస్టులు రూ. 8 లక్షలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేశారని వారిపై తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు. రాసిన వార్త పై అభ్యంతరాలు ఉంటే వాటిపై స్పందించడానికి చాలా మార్గాలు ఉన్నాయని ఎలా తప్పుడు కేసులు పరిష్కారం కాదని హితవు పలికారు. తప్పుడు కేసులు పెట్టే వారికి వత్తాసు పలికి ఇలా అక్రమ కేసులు బనాయించటం పోలీసులకు తగదని హితవు పలికారు. ఈ సందర్భంగా డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అభిశక్త్ కిషోర్ కు అందజేసి చర్చించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని కలెక్టర్ ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జర్నలిస్టులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు, సాక్షి బ్యూరో చీఫ్ రాఘవేంద్ర రెడ్డి, సూర్య బ్యూరో చీఫ్ బి. శ్రీనివాసరావు, ఏపీఎఫ్ డబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. గణేష్, కె. సురేష్, లీడర్ బ్యూరో చీఫ్ ఈ. వెంకటేష్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యుడు మొల్లి కమల్ కుమార్ స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి .అశోక్ కుమార్, సామ్నా రాష్ట్ర కార్యదర్శి కె. చక్రవర్తి, కృష్ణ కిషోర్, ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్వర్క్ (ఐ డి జే ఎన్) ప్రతినిధి వై. బాలకృష్ణ, ఆరిలోవ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామరాజు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మళ్ళా భాస్కర్ , ఏపీఈఎంజె రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట అప్పారావు,జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు,పలువురు సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాసాచారి, ఎస్ సన్యాసిరావు, బి. నారాయణరావు, రమణ, విల్లా బుజ్జి,ఎస్. నాగేశ్వరరావు, ఆర్ .అబ్బాస్ , ఎం శ్రీహరి , రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం - ఏసీపి రామచంద్రరావు

## -జి.కొండూరులో వాహనాల తనిఖీ,హెల్మెట్ డ్రైవ్



**జి.కొండూరు,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని,తల్లిదండ్రులు ఈ విషయం లో బాధ్యతగా ఉండాలని మైలవరం ఏసీపి రామచంద్రరావు హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరం డివిజన్, జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జి.కొండూరు ఆత్కూరు క్రాస్ రోడ్స్ వద్ద గురువారం మైలవరం ఏసీపి రామచంద్ర రావు వాహనాలు తనిఖీలు మరియు హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి రామచంద్రరావు ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐ ఎస్) గుర్తింపు పొందిన హెల్మెట్ ధరించాలని,ఇది ప్రమాద సమయాల్లో ప్రాణాలను కాపాడుతుందని స్పష్టం చేశారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయ ని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి హెల్మెట్ లేకుండా ప్రయాణించిన పలువురు వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు స్వీయ రక్షణ ఎంత ముఖ్యమో వివరించారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసమే పోలీసులు ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ-2 ఆర్.గిరిజామణి కోరారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ స్మశాన వాటిక సి ఎస్ ఆర్ నిధులకు కు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ మంజూరు..

- దాతల సహకారం తో చురుగ్గా సాగుతున్న పనులు..
- పాత్రికేయుల సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు



**పెడన,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** పట్టణంలో హిందూ స్మశాన వాటికకు మంజూరైన సి ఎస్ ఆర్ నిధులకు పరిపాలన సంబంధమైన అనుమతులు లభించాయని హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం నాడు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ స్మశాన అభివృద్ధి కోసం ఇప్పటివరకు రెండు కోట్లు విరాళాలు వచ్చాయన్నారు. సిఎస్ఆర్ నిధులకు కూడా పరిపాలనపరమైన అనుమతులు లభించాయని కలెక్టర్ ధ్రువీకరించారు అన్నారు. అందుకు సంబంధించిన పత్రాలను వేణు పాత్రికేయులకు చూపించారు. దాతల సహకారం మరువలేనిది అన్నారు. ఎంపీ బాలసౌరి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సహకారంతో పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. కట్టా హేమసుందర మూర్తి మాట్లాడుతూ తొలుతు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడానికి కొంతమంది ఇబ్బంది పెట్టారన్నారు. అధికారుల సహకారంతో అన్నీ అదిగమించాము. వేణు చాతుర్యం తో పనులు ముందుకు సాగాయి. ఇపుడు పరిస్థితి సానుకూలంగా ఉందని అన్నారు. 1989లో ఉద్రిక్తల మధ్య ఆక్రమణలు తొలగింపు జరిగిందన్నారు. పూలబాబు కూడా సహకరించారని మూర్తి అన్నారు. బళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిది ప్రతి ఉక్కరినీ కలుస్తాం లక్ష రూపాయలు ఎంత విలువైనవో వెయ్యి కూడా అంతే విలువ అని అన్నారు. ఈ సమావేశంలో బొడ్డు దీక్ష వాసా సాంబశివరావు ఊటుకూరి ప్రకాశరావు యక్కల నాగేశ్వరావు వాసా గంగాధర రావు తోట పైడేశ్వరావు కమ్మగంటి వెంకటేశ్వరావు గుల్లంకి మాధవ యర్రా రాజా యక్కల శ్యామలయ్య యక్కల బసవ తదితరులు పాల్గొన్నారు. పాత్రికేయులు సమావేశానికి ముందుగా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.

# బీజేపీ తిరువూరు అర్బన్ సేవా సంకల్ప్ అభియాన్ విజయవంతం

- అంగన్వాడీ కార్యకర్తలకు ఘన సన్మానం.. గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు



**తిరువూరు,అక్టోబర్ 8 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి పోలే శాంతి నాయకత్వంలో తిరువూరులో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు శ్రీ నితిన్ నబిన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ అడ్డూరి శ్రీరామ్ ఆదేశాల మేరకు తిరువూరు పట్టణ అధ్యక్షులు వెంపాటి అబ్రహం మణిరత్నం ఆధ్వర్యంలో తిరువూరు షాదీఖానాలో కార్యక్రమం నిర్వహించారు. పోలే శాంతి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పది సెక్టార్ల నుంచి వచ్చిన 425 మంది అంగన్వాడీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. అంగన్వాడీ కార్యకర్తల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమలను పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీఓ బి. కృష్ణకుమారి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శనను పోలే శాంతి, వెంపాటి అబ్రహం మణిరత్నం తిలకించారు. ఈ సందర్భంగా పోలే శాంతి అంగన్వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు, వారి తల్లిదండ్రుల సంక్షేమానికి అంగన్వాడీ వ్యవస్థ అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188